teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు ...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి: 04 | సంచిక: 272 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | పేజీలు : 8 | బుధవారం 8 ఏప్రిల్ 2026 | వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad


## బీఆర్ఎస్ చేతిలో 200 యూట్యూబ్ ఛానెళ్లు

- మంత్రి జూపల్లి సంచలన వ్యాఖ్యలు
- అసత్య ప్రచారాలను తిప్పికొట్టండి
- కాంగ్రెస్ కార్యకర్తలకు జూపల్లి పిలుపు

3



## ఐదు రాష్ట్రాలలో ఆసన్నమైన ఎన్నికల సమరం




- కేంద్ర ఎన్నికల సంఘం కీలక మార్గదర్శకాలు
- పోలింగ్‌కు ముందు 48 గంటల సైలెంట్ పీరియడ్: ఈసీఐ
- తమిళనాడు, బెంగాల్ సహా ఎన్నికల తేదీలు ఖరారు
- డిజిటల్, సోషల్ మీడియా వేదికలపై ఈసీ ప్రత్యేక నిఘా



# కాళేశ్వరం విచారణలో కీలక ఘట్టం

## నేడే హైకోర్టు తుది తీర్పు

- కమిషన్ చట్టబద్ధతపై న్యాయస్థానం నిర్ణయం
- కేసీఆర్, హరీశ్ రావు పిటిషన్లపై వెలువడనున్న ఉత్తర్వులు
- తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ
- రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు కానున్న తీర్పు



**హైదరాబాద్, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం అవకతవకలపై విచారణ జరిపిన జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ నివేదిక భవితవ్యం నేడు (బుధవారం) తేలనుంది. ఈ కమిషన్ చట్టబద్ధతను, అది అనుసరించిన విచారణ ప్రక్రియను సవాలు చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు బుధవారం తుది తీర్పును వెలువరించనుంది. వివాదానికి నేపథ్యం తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం - మిగతా2లో

## పరిగిలో హరీష్ రావు అరెస్ట్



2లో

- ముందస్తు అరెస్టులు చేసినా తగ్గేదేలే
- రైతుల వద్దకు వెళ్లి తీరుతాం: హరీష్‌రావు
- ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది

## ఐపీఎల్ ఫార్మాట్‌తో ఏడాదికి రూ. 2400 కోట్ల నష్టం



- 74 మ్యాచ్‌లేనా.. 94 మ్యాచ్‌లు నిర్వహించాలి
- లలిత్ మోదీ డిమాండ్
- బీసీసీఐ తీరుపై లలిత్ మోదీ తీవ్ర అసహనం

2లో



## తెలంగాణను మోసం చేసిన రేవంత్

- "ఇప్పుడు కేరళ వెళ్తున్నారు"
- కేరళ ప్రజలు కాంగ్రెస్ బాధితులుగా మారొద్దు
- రేవంత్ రెడ్డిపై కవిత ఘాటు విమర్శలు
- సోషల్ మీడియాలో వీడియో విడుదల

2

# అభివృద్ధి సూచీల్లో కేరళే అగ్రస్థానం



- రేవంత్ ఆరోపణలు అవాస్తవం: పినరయి
- రేవంత్ రెడ్డి విమర్శలకు కేరళ సీఎం బహిరంగ లేఖ
- నీతి ఆయోగ్ గణాంకాలతో విజయన్ కౌంటర్

**తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):** కేరళ, తెలంగాణ ముఖ్యమంత్రుల మధ్య సోషల్ మీడియా వేదికగా సాగుతున్న మాటల యుద్ధం ముదిరింది. కేరళ ప్రభుత్వ పనితీరుపై రేవంత్ రెడ్డి చేసిన విమర్శలకు స్పందిస్తూ, కేరళ సీఎం పినరయి విజయన్ ఒక బహిరంగ లేఖ విడుదల చేశారు. రాజకీయ విబేధాలను పరిష్కరించుకోవడానికి వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదని ఆయన రేవంత్‌కు హితవు పలికారు. నీతి ఆయోగ్ విడుదల చేసిన ఎస్డీజీ ఇండెక్స్ 2023-24లో 79 పాయింట్లతో కేరళ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని, తెలంగాణ 6వ స్థానంలో ఉందని విజయన్ గుర్తు చేశారు. కేరళ సాధించిన ఈ విజయాలు దశాబ్దాలుగా ఎల్.డీ.ఎఫ్ ప్రభుత్వాలు - మిగతా2లో



## టీజీసెట్ ఆరు నుండి తొమ్మిది తరగతుల ఫలితాలు విడుదల

- ఫేజ్-1లో 6,242 సీట్ల భర్తీ.. అడ్మిషన్ల షెడ్యూల్ ఖరారు
- ఏప్రిల్ 7 నుండి 20 వరకు స్కూళ్లలో రిపోర్టింగ్ చేయాలి

**తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):** తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ౧+జజు 2026 ఫేజ్-1 ఫలితాలను సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం సచివాలయంలో ఫలితాలను - మిగతా2లో



## కాంగ్రెస్ సర్కార్‌వి పిరికిపంద చర్యలు

- బీఆర్ఎస్ నేతల అరెస్టులపై కేటీఆర్ ధ్వజం
- హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి గృహ నిర్బంధం
- అరెస్టయిన నేతలను విడుదల చేయండి: కేటీఆర్ డిమాండ్
- రైతుల అనుమతి లేకుండా భూములు సేకరిస్తే సహించబోం

2

## చర్చకు ఎప్పుడు సిద్ధమన్నా నేను రెడీ

- కేరళ సీఎంకు రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్
- విజయన్‌కు రోల్ మోడల్ మోదీనా లేక జ్యోతిబసునా..?
- సూటిగా ప్రశ్నించిన సీఎం రేవంత్ రెడ్డి

2లో



# అభివృద్ధి సూచీల్లో కేరళే అగ్రస్థానం

-మొదటిపేజీ తరువాయి

చేసిన కృషి వల్లే సాధ్యమయ్యాయని, ఇందులో కాంగ్రెస్ గొప్పదనం ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు.

**అవినీతిపై విమర్శలు**

నీతి ఆయోగ్ గణాంకాల ప్రకారం భారతదేశంలోనే అత్యంత తక్కువ అవినీతి ఉన్న రాష్ట్రం కేరళ అని విజయన్ పేర్కొన్నారు. ఇదే సమయంలో తెలంగాణ 6వ అత్యంత అవినీతిమయ రాష్ట్రంగా ఉందని ఆయన ఎత్తిచూపారు.

**పేదరిక నిర్మూలనలో రికార్డు**

నవంబర్ 1, 2025 నాటికి అత్యంత పేదరికం లేని ఏకైక రాష్ట్రంగా కేరళ అవతరించిందని విజయన్ గర్వంగా ప్రకటించారు. 64,006 కుటుంబాలను గుర్తించి, వారికి ప్రత్యేక మైక్రో-ప్లాన్ల ద్వారా ఉపాధి, ఆసరా కల్పించామని వివరించారు.

**ఐటీ, పారిశ్రామిక వృద్ధి**

కేరళ తన 2026 ఐటి పాలసీ ద్వారా భారత ఐటీ ఎగుమతుల్లో 10% వాటాను లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. విజింజం అంతర్జాతీయ నౌకాశ్రయం ద్వారా కేరళ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో కేరళ ఇప్పుడు అగ్రస్థానంలో ఉందని, పారిశ్రామిక స్తబ్దత ఉందన్న రేవంత్ వ్యాఖ్యలు అవాస్తవమని కొట్టిపారేశారు.

**కేంద్రంపై పోరాటం**

బీజేపీతో తాను మెతకగా ఉంటున్నానన్న ఆరోపణలను విజయన్ తిరస్కరించారు. కేంద్రం అనుసరిస్తున్న సమాఖ్య వ్యతిరేక విధానాలపై సుప్రీంకోర్టులో రాజ్యాంగబద్ధంగా పోరాడుతున్నది కేరళ ప్రభుత్వమేనని ఆయన గుర్తు చేశారు. మైనారిటీల హక్కుల కోసం, రాజ్యాంగ విలువల కోసం తమ ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తోందని అన్నారు.

**కాంగ్రెస్‌పై విమర్శలు**

గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కేరళకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వంటి అనేక ప్రాజెక్టుల విషయంలో మొండిచేయి చూపిందని, కొచ్చి మెట్రో వంటి ప్రాజెక్టులను ఆలస్యం చేసిందని విజయన్ ఆరోపించారు. లేఖ చివరలో విజయన్ మలయాళంలో ఒక శక్తివంతమైన వ్యాఖ్య చేశారు. మేము ముందుకు వెళ్తాము కేవలం ముందడుగు మాత్రమే వేస్తాం. నవ కేరళ నిర్మాణంతో అందరికీ ఆదర్శంగా నిలుస్తాం. రాజకీయ విమర్శలు చేసేటప్పుడు భాషా సంస్కారం ఉండాలని, హద్దులు దాటి మాట్లాడటం సరికాదని రేవంత్ రెడ్డికి పినరయి విజయన్ ఈ లేఖ ద్వారా స్పష్టమైన హెచ్చరిక పంపారు.

## తెలంగాణను మోసం చేసిన రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):

కేరళలో ఎన్నికల ప్రచారానికి నేటితో తెరపడనుంది. ఈ క్రమంలోనే అక్కడ ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి సైతం అక్కడ ప్రచారంలో పాల్గొంటూ పినరయి విజయన్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే రేవంత్‌కు కౌంటర్‌గా తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ నిలువునా మోసం చేశారంటూ తెలంగాణ జాగృతి చీఫ్ కల్వకుంట్ల కవిత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా సంచలన వీడియోను విడుదల చేశారు. ఆ వీడియాలో కవిత మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను గాలికొదిలేశారని, ఇప్పుడు అదే స్క్రిప్ట్‌తో రేవంత్ రెడ్డి కేరళకు వస్తున్నారని కామెంట్ చేశారు. తెలంగాణలో రైతు రుణమాఫీ, ఉద్యోగ కల్పన, రైతు సంక్షేమం వంటి ప్రధాన వాగ్దానాలన్నీ ఇప్పటికీ అమలు కాదేదని చురకలంటించారు.

తెలంగాణలో విఫలమైన అదే మోసపూరిత హామీలను ఇప్పుడు కేరళ ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి వాడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ తరహాలో కేరళ ప్రజలు కూడా కాంగ్రెస్ బాధితులుగా మారొద్దని, అభివృద్ధిని కొనసాగించాలంటే పినరయి విజయన్ వంటి నిరూపితమైన నాయకత్వాన్నే ఎంచుకోవాలని పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ సర్కార్‌వి పిరికిపంద చర్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):

కాంగ్రెస్ సర్కార్‌వి పిరికిపంద చర్యలు అంటూ బీఆర్ఎస్ నేతల అరెస్టులపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పరిగి నియోజకవర్గంలో తమ భూములను కాపాడుకోవడానికి పోరాడుతున్న రైతులకు మద్దతుగా వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను అక్రమంగా గృహ నిర్బంధం చేయడం, అరెస్టులు చేయడంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ తీరును పిరికిపంద చర్యగా ఆయన అభివర్ణించారు. మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రా రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేష్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ సహా పలువురు నేతలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్తేమీ కాదని. తెలంగాణ ఉద్యమ కాలం నుండి ఇలాంటి ఎన్నో ఆంక్షలను మేం ఎదుర్కొన్నాం. ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలబడతాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. రైతుల ఆవేదనను వినాల్సింది పోయి, వారికి మద్దతుగా వస్తున్న విపక్ష నేతలపై ఆంక్షలు విధించడం ద్వారా ప్రభుత్వం తన బలహీనతను బయటపెట్టుకుంటోందని విమర్శించారు. అక్రమంగా నిర్బంధించిన నేతలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పరిగిలో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూములను సేకరించడాన్ని తక్షణమే నిలిపివేయాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని కోరారు. రైతుల అనుమతి లేకుండా, వారిని ఇబ్బందులకు గురి చేస్తూ సాగిస్తున్న ఈ ప్రక్రియను బీఆర్ఎస్ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని హెచ్చరించారు. రైతుల ప్రయోజనాల కోసం తాము ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, బాధితులకు అండగా ఉంటామని ఆయన పునరుద్ఘాటించారు.

## చర్చకు ఎప్పుడు సిద్ధమన్నా నేను రెడీ

హైదరాబాద్, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):




కేరళ సీఎం పినరయి విజయన్ కు రాసిన లేఖపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పినరయి విజయన్ ఎప్పుడు సిద్ధమన్నా తాను చర్చకు సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. మంగళవారం ఆయన తిరువనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. పినరయి విజయన్‌కి రోల్ మోడల్స్ జ్యోతిబసు, సోమనాథ్ ఛటర్జీలా? లేక నరేంద్ర మోదీ, అమిత్ షానా? అని ప్రశ్నించారు. కానీ, ఆయన నరేంద్ర మోదీని తన రోల్ మోడల్‌గా భావిస్తున్నారని, ఆయన పద్ధతులు కేరళ ప్రజలకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని విమర్శించారు. విజయన్ ఓ ముఖ్యమంత్రిలా కాకుండా, మరో నరేంద్ర మోదీ తరహాలో ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పినరయి విజయన్‌పై ఉన్న అవినీతి కేసుల నుంచి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆయనను రక్షిస్తోందని విమర్శించారు. అందుకే ఎన్ని ఆరోపణలు వచ్చినా ఆయనపై కేంద్ర సంస్థలు చర్యలు తీసుకోవడం లేదని రేవంత్ రెడ్డి కామెంట్ చేశారు. దేశ రాజకీయాల్లో ఇండియా కూటమి భాగస్వాముల మధ్య ఇటువంటి వాగ్వాదం చోటుచేసుకోవడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. కేరళలో కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల మధ్య ఉన్న రాజకీయ వైరం ఈ వ్యాఖ్యలతో మరోసారి బహిర్గతమైంది.

## వారికి విదేశాల్లోనే ఎక్కువ గుర్తింపు

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ సభ్యులుకేటీఆర్, సంతోష్ రావులకు లోకల్ కన్నా అంతర్జాతీయ గుర్తింపు ఎక్కువగా లభిస్తోంది. రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కు లండన్ కేంద్రంగా పనిచేసే డబ్ల్యూ.బి.ఏ వంటి సంస్థ గ్రీన్ ఐకాన్ అవార్డును ప్రకటించింది.సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కేవలం ఒక రాష్ట్రానికో, దేశానికో పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందింది. అధికారంలో ఉన్నప్పుడు ప్రభాస్, సచిన్ టెండూల్కర్, పవన్ కళ్యాణ్ వంటి సెలబ్రిటీలతో మొక్కలు నాటించి ఒక ఉత్సాహాన్ని నింపిన ఆయన, ఇప్పుడు అధికారం లేకపోయినా అదే పట్టుదలతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. లండన్ సంస్థ ప్రకటించిన గ్రీన్ ఐకాన్ అవార్డు ఆయన పర్యావరణ స్పృహకు దక్కిన గౌరవంగా భావించవచ్చు. బి.ఆర్.ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన అకడమిక్ ,ప్రొఫెషనల్ ఇమేజ్ను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టుకుంటున్నారు. ఇటీవల అమెరికాలోని ప్రతిష్టాత్మక కొలంబియా యూనివర్శిటీలో ప్రసంగించారు. గతంలో ఆక్స్ఫర్డ్ మరియు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వంటి వేదికలపై తెలంగాణ అభివృద్ధి మోడల్ను వివరించారు.

## టీజీసెట్ ఆరు నుండి తొమ్మిది తరగతుల ఫలితాలు విడుదల

-మొదటిపేజీ తరువాయి

విడుదల చేశారు. 2026-27 విద్యా సంవత్సరానికి ఎ× నుంచి ×ౚ తరగతుల వరకు బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీతో పాటు ౧+ఒ౭=జు×ూ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పరిగి (బాలికలు), ఖమ్మం (బాలురు)లో ఎ××× తరగతి ప్రవేశాలకు ఈ ఫలితాలను విడుదల చేశారు. ఫిబ్రవరి 22న రాష్ట్రవ్యాప్తంగా 492 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 1,02,960 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫేజ్-1లో మొత్తం 6,242 సీట్లు భర్తీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఏప్రిల్ 7 నుండి 20 వరకు తమకు కేటాయించిన పాఠశాలల్లో ధృవపత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో హాజరుకావాలని మంత్రి అడ్లూరి సూచించారు. ఈ సందర్భంగా సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... విద్యార్థుల అడ్మిషన్ ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పూర్తిస్థాయి పారదర్శకతతో ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి విద్యార్థికి న్యాయం జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. దళిత, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించాలనే సంకల్పంతో రేవంత్ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. కార్పొరేట్ స్థాయి విద్య, డిజిటల్ క్లాస్‌రూమ్స్, పోటీ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమతుల్య ఆహారం, రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు, క్రీడా సదుపాయాలు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికితీసేలా మెంటరింగ్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తును బలపర్చడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

## ఐపీఎల్ ఫార్మాట్‌తో ఏడాదికి రూ. 2400 కోట్ల నష్టం

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) నిర్వహణపై మరోసారి పెద్ద ఎత్తున చర్చ చెలరేగింది. బీసీసీఐ విధానాలపై ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోడీ తీవ్రంగా మండిపడ్డారు. బీసీసీఐ తీసుకున్న నిర్ణయాలతో ఏడాదికి రూ.2400 కోట్ల వరకు ఈ లీగ్ కి నష్టం వాటిల్లుతోందని ఆయన చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. ప్రస్తుతం లీగ్‌లో 10 టీమ్స్ ఉన్నప్పటికీ కేవలం 74 మ్యాచ్‌లతోనే టోర్నమెంట్ నిర్వహిస్తున్నారని తెలిపారు. అసలు ఈ ఫార్మాట్ ప్రకారం ప్రతి జట్టు ఒకే ప్రత్యర్థితో రెండేసి మ్యాచ్‌లు ఆడితే లీగ్ దశలోనే 90 మ్యాచ్‌లు, ప్లే ఆఫ్స్ కలిపి మొత్తం 94 మ్యాచ్‌లు జరగాల్సి ఉందని లలిత్ మోడీ పేర్కొన్నారు. కొద్ది కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆదరణ పొందిన టీ20 లీగ్ గా ఐపీఎల్ చరిత్ర నెలకొల్పింది. ఇటీవలే ఈ టోర్నీ ప్రసార హక్కులు ఏకంగా రూ.48,390 కోట్లకు అమ్ముడుపోవడంతో పాటు ఈ సీజన్‌కు ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలు భారీ మొత్తానికి అమ్ముడైయ్యాయి. ఈ విషయంపై కూడా ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మాట్లాడుతూ ఒక్కో మ్యాచ్‌కు మీడియా హక్కులతో భారీ ఆదాయం ఆర్జిస్తుంది. హోంగ్రౌండ్ తో పాటు బయటి స్టేడియాల్లో కూడా మ్యాచ్‌లు జరిగే విధానం అమలు చేస్తే అదనంగా వేల కోట్లు బీసీసీఐ అకౌంట్లో చేరేవి ఆ ఆదాయంలో సగం ఐపీఎల్ ఫ్రాంచైజీలకు వెళ్తుంది. దాంతో టీమ్స్ వ్యాల్యూ కూడా మరింత పెరుగుతుందని లలిత్ మోడీ వెల్లడించారు. ఇటీవల ఆర్సీబీ, రాజస్థాన్ జట్లు భారీ ధరకు అమ్ముడుపోవడం నాకు సంతోషంగా ఉంది. కానీ టీమ్స్ కి హామీ ఇచ్చిన ఫార్మాట్‌ను అమలు చేయకపోవడం వాణిజ్య ఒప్పందానికి విరుద్ధమని లలిత్ మోడీ తెలిపారు. ఐపీఎల్ ప్రారంభమైన తొలినాళ్లలో 8 జట్లు మాత్రమే ఉండగా ప్రతి టీమ్ హోంగ్రౌండ్ తో పాటు ఇరత స్టేడియాల్లో ఒకే ప్రత్యర్థితో రెండు మ్యాచ్‌లు తప్పనిసరిగా ఆడుతుండేవి కానీ ఇప్పుడు లీగ్‌లో 10 జట్లు ఉన్నాయి. తప్పకుండా 94 మ్యాచులు జరగాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 74 మ్యాచులు మాత్రమే జరుగుతున్నాయి. తగ్గిన 20 మ్యాచుల వలన ఒక్కో మ్యాచ్ కి వచ్చే రూ. 118 కోట్ల మీడియా రైట్స్ ఆదాయం పోతుంది. ఫ్రాంచైజీలు కూడా రూ. 120 కోట్ల చొప్పు నష్టపోతున్నారని ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోడీ చెప్పుకొచ్చారు.

## మీడియాలో వైరలవుతున్న జనసేన ఎమ్మెల్యేలు

జనసేన పార్టీ ఎమ్మెల్యేల తీరుపై రోజుకో హైలెట్ మీడియాలో వస్తోంది. గత ఎన్నికల్లో ఘన విజయాన్ని నమోదు చేసిన ఆ పార్టీకి, ఇప్పుడు అదే గెలుపు కొత్త తలనొప్పులను తెచ్చిపెడుతోంది. ముఖ్యంగా మొదటిసారి చట్టసభకు ఎన్నికైన కొందరు ఎమ్మెల్యేల దూకుడు, వారి చుట్టూ ముసురుతున్న వివాదాలు పార్టీ అధినేత పవన్ కల్యాణ్కు సవాల్గా మారాయి.నియోజకవర్గాల్లో పట్టు సాధించే క్రమంలో కొందరు వ్యక్తిగత ప్రతిష్టకు పోతుండగా, మరికొందరు అధికారులపై ఒత్తిడి తీసుకురావడం, స్థానిక సెటిల్మెంట్లలో తలదూర్చడం వంటి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇక అరవ శ్రీధర్ వంటి వారి వ్యక్తిగత వ్యవహారాలు పార్టీకి అంటుతున్నాయి. కొందరు ఎమ్మెల్యేలు తమ వ్యాపార ప్రయోజనాల కోసం అధికార బలంతో రంగంలోకి దిగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యవహారాలు, స్థానిక కాంట్రాక్టులు, ఇసుక తదితర అంశాల్లో జోక్యం పెరిగిందని సొంత పార్టీ శ్రేణులే అంతర్గతంగా చర్చించుకుంటున్నాయి. టీడీపీలో గతంలో కొందరు నేతలు ఎలాగైతే అతిగా వ్యవహరించి పార్టీకి చెడ్డపేరు తెచ్చారో, ఇప్పుడు జనసేనలోనూ అదే ధోరణి కనిపిస్తుండటం కార్యకర్తలను ఆందోళనకు గురిచేస్తోంది. పార్టీ క్రమశిక్షణ విషయంలో పవన్ కల్యాణ్ కచ్చితంగా ఉంటారని భావించినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి

## కాళేశ్వరం విచారణలో కీలక ఘట్టం

-మొదటిపేజీ తరువాయి

ప్రాజెక్టులో ముఖ్యంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కుంగుబాటు, సాంకేతిక లోపాలు మరియు ఆర్థిక అవకతవకలపై విచారణకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పి.సి. ఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ గత ఏడాది కాలంగా సాక్ష్యాధారాలను సేకరించి, బాధ్యులపై చర్యలకు సిఫార్సు చేస్తూ ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది.

**పిటిషనర్ల వాదన.. నిబంధనల ఉల్లంఘన**

హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన కేసీఆర్ మరియు హరీశ్ రావు ప్రధానంగా కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ (1952) లోని సెక్షన్ 8బీ, 8సీ ల ఉల్లంఘన జరిగిందని వాదించారు. తమ వివరణ తీసుకోకుండానే కమిషన్ ఒక నిర్ణయానికి వచ్చిందని వారి తరపు న్యాయవాదులు పేర్కొన్నారు. సాక్షులను క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశం కల్పించలేదని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని వాదించారు. ఈ కమిషన్ నివేదిక రాజకీయ ప్రేరేపితమని, దానిని పూర్తిగా కొట్టివేయాలని కోరారు.

**ప్రభుత్వం తరుపున వాదన**

రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఈ వాదనలను తోసిపుచ్చారు. ప్రజల సొమ్ము వేల కోట్ల రూపాయలు వృథా అయ్యాయని, విచారణలో ఎక్కడా పారదర్శకత లోపించలేదని కోర్టుకు వివరించారు. కమిషన్ నోటీసులు ఇచ్చినా పిటిషనర్లు సరైన సమయంలో స్పందించలేదని ప్రభుత్వం పేర్కొంది.

**రాజకీయ ప్రకంపనలు తప్పవా..?**

ఈ తీర్పు తెలంగాణ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

1. అనుకూలంగా వస్తే: ఒకవేళ కోర్టు కమిషన్ నివేదికను సమర్థిస్తే, ప్రభుత్వం వెంటనే దోషులపై క్రిమినల్ కేసులు నమోదు చేసే దిశగా అడుగులు వేయవచ్చు.
2. ప్రతికూలంగా వస్తే: నివేదికను కోర్టు తోసిపుచ్చితే, అది కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బగా మారుతుంది మరియు బీఆర్ఎస్ శ్రేణులకు రాజకీయ బలాన్ని ఇస్తుంది. చీఫ్ జస్టిస్ ధర్మాసనం నేడు ఈ తీర్పును ప్రకటించనుంది. ఈ ఉత్కంఠకు తెరపడాలంటే వేచి చూడాల్సిందే.

## ఐదు రాష్ట్రాలలో ఆసన్నమైన ఎన్నికల సమరం




న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమరానికి సమయం ఆసన్నమైన వేళ, కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. పోలింగ్‌కు ముందు తప్పనిసరిగా అమలు చేసే 48 గంటల 'సైలెంట్ పీరియడ్'లో రాజకీయ పార్టీలు, మీడియా పాటించాల్సిన కఠిన నిబంధనలను మరోసారి స్పష్టం చేసింది. అస్సాం, కేరళ, పుదుచ్చేరిలలో ఏప్రిల్ తొమ్మిదిన పోలింగ్ జరగనుంది. తమిళనాడులో ఏప్రిల్ 23న, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951, సెక్షన్ 126 (1)(ఎ) ప్రకారం పోలింగ్ ప్రక్రియ ముగియడానికి ముందున్న 48 గంటల సమయాన్ని 'సైలెంట్ పీరియడ్' అని అంటారు. ఈ సమయంలో ఓటర్లను ప్రభావితం చేసే లేదా ఏదైనా రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉండే ఎలాంటి సమాచారాన్ని మీడియా లేదా ఇతర పబ్లిక్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రసారం చేయకూడదు.

**ఎగ్జిట్ పోల్స్‌పై బ్యాన్**

ఓటర్లు ప్రభావితం కాకుండా ఉండేందుకు ఎగ్జిట్, ఒపీనియన్ పోల్స్‌పై ఈసీ పూర్తి నిషేధం విధించింది. ఏప్రిల్ 9వ తేదీ ఉదయం 7 గంటల నుంచి ఏప్రిల్ 29 సాయంత్రం 6.30 గంటల వరకు ఈ బ్యాన్ అమలులో ఉంటుంది. ఈ ఐదు రాష్ట్రాలతో పాటు గోవా, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో జరిగే ఎనిమిది ఉప ఎన్నికలకూ ఇది వర్తిస్తుంది. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలకు ఈ నిబంధనలు సమానంగా వర్తిస్తాయి.

## పరిగిలో హరీష్ రావు అరెస్ట్

హైదరాబాద్, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. పరిగిలో రైతులకు సంఘీభావంగా వెళుతున్న హరీష్‌ను పోలీసుల అరెస్ట్ చేశారు. ఈ అంశంపై తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతుల బాధ వినడానికి తాము వెళ్తామ చెబుతున్నా వినడం లేదన్నారు. రేవంత్ రెడ్డి పరిస్థితి పిచ్చోడు చేతిలో రాయిలాగా తయారైంది. హైడ్రా పేరిట పేదల గుడిసెలు కూల్చే ప్రయత్నం చేశారు. మూసి పేరిట అపార్ట్మెంట్లను కూల్చే ప్రయత్నం చేశారు. యూనివర్సిటీ భూములను లాక్కునే ప్రయత్నం చేశారు. ఫ్రూట్ మార్కెట్ ల్యాండ్ కూడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టాలని చూస్తున్నారు. దళిత బలహీన వర్గాల మీద దండయాత్ర చేస్తున్నారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామన్నారు కానీ ఉన్న భూములు లాక్కుంటున్నారు. ఎక్కడ ఎస్సీ ఎస్టీ వాళ్ళ భూములు ఉంటే అక్కడ ఇండస్ట్రియల్ నోటిఫికేషన్ ఇస్తున్నారు ముందస్తుగా అరెస్టు చేసినా సరే మేము అక్కడికి వెళ్లి తీరుతాం. మీరు ఇచ్చిన హామీలను ముందు నెరవేర్చండి. అధికారంలోకి వచ్చేవరకు ఒక మాట వచ్చిన తర్వాత మరో మాట కాంగ్రెస్ చెబుతోంది. భూములు తప్ప ఇంకోటి పట్టదా? పాలన చేయమంటే భూములు లాక్కోవడం ఏంటి? అని హరీష్‌రావు ప్రశ్నించారు.

## అమరావతికి రాజముద్ర

అమరావతికి రాజముద్ర పడింది. పార్లమెంట్ ఉభయసభలు ఆమోదించాయి. అలాగే రాష్ట్రపతి కూడా సంతకం చేశారు. వెంటనే గెజిట్ విడుదల అయింది. అంటే ఇక సీఆర్డీఏ ప్రాంతాన్ని అమరావతి రాజధానిగా గుర్తిస్తారు. ఈ పరిణామం వెనుక ఉన్న అసలు మాస్టర్ ప్లాన్  లోతైన ఆర్థిక , చట్టపరమైన వ్యూహాలు ఉన్నాయి.అమరావతికి పార్లమెంట్ ఆమోదం లభించడం వెనుక ప్రధాన కారణం కేంద్ర సాయం , నిధుల విడుదల. విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మాణానికి కేంద్రం సహాయం చేయాలి. అయితే, గతంలో అమరావతిని కేవలం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేసింది కానీ, కేంద్ర గెజిట్లో అది పూర్తిస్థాయిలో లేదు. ఇప్పుడు పార్లమెంట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) చట్టం, 2026 అమలులోకి రావడంతో, అమరావతికి కేంద్ర గ్రాంట్లు నేరుగా పొందే హక్కు లభించింది. వరల్డ్ బ్యాంక్, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్ ( వంటి సంస్థల నుండి వస్తున్న సుమారు రూ.26,000 కోట్లని ధులకు ఈ గెజిట్ నోటిఫికేషన్ ఒక బలమైన గ్యారెంటీగా పనిచేస్తుంది.చట్టబద్ధత రావడం వల్ల ప్రైవేట్ ఇన్వెస్టర్లలో ఉన్న సందిగ్ధత పూర్తిగా తొలగిపోయింది. 2019-2024 మధ్య జరిగిన పరిణామాల వల్ల అమరావతి బ్రాండ్ దెబ్బతిన్నది. కానీ ఇప్పుడు పార్లమెంట్ ఆమోదంతో, అక్కడ పెట్టిన ప్రతి పైసాకు చట్టపరమైన రక్షణ లభించింది. ఇప్పటికే సుమారు రూ. 56,000 కోట్ల విలువైన పనులు వేగంగా జరుగుతున్నాయి. సింగపూర్ సంస్థలతో కుదుర్చుకున్న పాత ఒప్పందాలు మళ్లీ పట్టాలెక్కే అవకాశం ఉంది.

# లొంగిపోయే ప్రసక్తే లేదు

**ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ ఘాటు స్పందన**

**హోర్ముజ్ జలసంధి వద్ద క్షిపణి వ్యవస్థల మోహరింపు**

**స్వచ్ఛందంగా కదులుతున్న ఇరాన్ పౌరులు**

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ నాగరికత అంతమవుతుందంటూ చేసిన సంచలన వ్యాఖ్యలపై ఇరాన్ ప్రభుత్వం అత్యంత కఠినంగా స్పందించింది. అమెరికా ఎన్ని బెదిరింపులకు దిగినా తాము లొంగిపోయే ప్రసక్తే లేదని, తమ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకుంటామని ఇరాన్ ప్రకటించింది. ట్రంప్ సోషల్ మీడియా వేదికగా చేసిన హెచ్చరికలను ఇరాన్ కొట్టిపారేసింది. అమెరికా బెదిరింపులకు భయపడే రోజులు పోయాయి. మా సైన్యం, ప్రజలు ఏ రకమైన దాడినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారు అని ఇరాన్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. అమెరికా గనుక తమపై దాడులకు దిగితే, తాము కేవలం సరిహద్దులకే పరిమితం కాబోమని ఇరాన్ హెచ్చరించింది. ప్రపంచంలో ఎక్కడైనా సరే శత్రువుల లక్ష్యాలపై దాడులు చేసే సామర్థ్యం మాకు ఉంది అని పేర్కొంటూ యుద్ధం వస్తే అది ఇరాన్‌తోనే ముగియదని సంకేతాలిచ్చింది.

మానవహారంతో దేశ రక్షణ

విదేశీ దాడుల నుండి దేశాన్ని కాపాడుకోవడానికి ఇరాన్ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తారని ప్రభుత్వం తెలిపింది. దేశవ్యాప్తంగా కీలక ప్రాంతాల్లో ప్రజలు 'మానవహారం నిర్వహించి, తమ మాతృభూమిని రక్షించుకుంటారని వెల్లడించింది. ఇప్పటికే ఇరాన్ తన క్షిపణి వ్యవస్థలను సిద్ధం చేసినట్లు సమాచారం. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి సమీపంలో, ఇతర వ్యూహాత్మక ప్రాంతాల్లో సైనిక మోహరింపును పెంచింది. ఒకవైపు ట్రంప్'చివరి హెచ్చరిక ఇవ్వడం, మరోవైపు ఇరాన్ ప్రతీకార దాడుల'కు సిద్ధమని ప్రకటించడంతో మధ్యప్రాచ్యంలో



పరిస్థితి అత్యంత భయానకంగా మారింది. ఈ మాటల యుద్ధం ఎప్పుడు సాయుధ పోరాటంగా మారుతుందోనని ప్రపంచ దేశాలు ఆందోళన చెందుతున్నాయి. శాంతి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని ఐక్యరాజ్యసమితి సహా పలు దేశాలు కోరుతున్నప్పటికీ, ఇరు దేశాల నాయకత్వాలు మాత్రం వెనక్కి తగ్గడం లేదు.

# తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రం

**తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో డీజీపీ పర్యటన**

**కర్రెగుట్టలో పోలీస్ ఔట్ పోస్ట్ పనులకు శంకుస్థాపన**

ములుగు, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో మంగళవారం డీజీపీ శివధర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కర్రెగుట్టలోని పామూనూరు బేస్ క్యాంప్ సమీపంలో పోలీస్ ఔట్ పోస్టును, ఇంటర్ ఏజెన్సీ కోఆర్డినేషన్ సెంటర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొరుమూరు నుంచి పామూనూరు వరకు దట్టమైన అడవుల్లో రోడ్డు నిర్మాణం చేశామని, డోలి, జెల్లా, చలిమెల గ్రామాలకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ఆదివాసీల అభివృద్ధి ధ్యేయంగా వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. పామూనూరు గ్రామస్థులకు అత్యవసర సమయాల్లో ఉపయోగపడేందుకు ఆటో, ద్విచక్ర వాహనాన్ని అందించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం మావోయిస్టు రహిత రాష్ట్రం అని తెలంగాణలో మావోయిస్టులు లేరు అన్నారు. నక్సలిజాన్ని రూపు మాపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే సాధ్యం అయిందని పేర్కొన్నారు. ఇంకా ఆరుగురు మావోయిస్టులు ఉన్నారని వారు మన రాష్ట్రంలో లేరని అన్నారు. మిగిలిన మావోయిస్టులు లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలవాలని సూచించారు. అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్ అలైవ్ అనే కార్యక్రమాన్ని వెంకటాపురం మండల కేంద్రంలోని కాఫెడ్ మైదానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. వెనుక ఉన్న వ్యక్తులకు సైతం హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని అన్నారు. హెల్మెట్ ధరించి ప్రయాణించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగితే రక్షణగా ఉంటుదని అలాగే కారు ఇతర వాహనాలు నడిపే వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సురక్షితమైన డ్రైవింగ్ చేయాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం



ప్రమాదకరం అని కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరు ఇంట్లో ద్విచక్రవాహనం నడిపే వారికి తప్పనిసరిగా హెల్మెట్ దరించేలా వివరించాలని అన్నారు.

అనంతరం గ్రామస్థులకు హెల్మెట్లను అందజేశారు. అరైవ్ అలైవ్ అనే కార్యక్రమం పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు.

# ఐపీఎల్ బెట్టింగ్ ఊబిలో పడొద్దు

**క్రికెట్ ప్రేమికులకు సీపీ సజ్జనార్ హెచ్చరిక**

**క్రికెట్ ప్రిడిక్షన్ మోసాలపై హైదరాబాద్ పోలీసుల నిఘా**

**నెల రోజుల్లో 494 బెట్టింగ్ ప్రకటనలు**

**129 సోషల్ మీడియా ప్రొఫైల్స్ బ్లాక్**

హైదరాబాద్, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్): ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)–2026 ఎడిషన్ ఇప్పటికే ఆరంభమైంది. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన లీగ్‌గా పేరొందిన ఈ టీ20 లీగ్‌ను క్యాష్ చేసుకునేందుకు మాయగాళ్లు బెట్టింగ్ పేరిట ఉచ్చు బిగుస్తూ ఉంటారు. ఈసారి కూడా ఐపీఎల్ ప్రిడిక్షన్ పేరిట ఆన్‌లైన్ బెట్టింగ్ ఉచ్చు జాగ్రత్త అని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ క్రికెట్ ప్రేమికులను హెచ్చరించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఐపీఎల్ క్రికెట్ ఫీవర్‌ను ఆసరాగా చేసుకుని సోషల్ మీడియాలో కొందరు మోసపూరిత ప్రకటనలతో విరుచుకుపడుతున్నారు. కేవలం డబ్బు కోసం కొంతమంది ఇన్ఫ్లుయెన్సర్లు అసత్య ప్రచారాలు చేస్తూ సామాన్యులను తప్పుదోవ పట్టిస్తున్నారు. టాస్ ఎవరిది!? మ్యాచ్ ఏ టీమ్ గెలుస్తుంది!? అని ముందే చెబుతామంటూ మిమ్మల్ని తమ ఛానెల్స్‌లో సబ్‌స్క్రైబ్ చేయించుకుని, నిలువునా ముంచే బెట్టింగ్ ఊబిలోకి లాగుతున్నారు. ఇలాంటి ఫేక్ ప్రిడిక్షన్ ఛానెళ్ల మాటలు నమ్మి మీ కష్టార్జితాన్ని పోగొట్టుకోవద్దు. ఇలాంటి ప్రమోషన్ల




విషయంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం కఠినంగా వ్యవహరిస్తోంది. గత నెల రోజుల్లోనే 494 పెయిడ్ ప్రకటనలను, వాటిని ప్రచారం చేస్తున్న 129 సోషల్ మీడియా ప్రొఫైళ్లను బ్లాక్ చేయించాం. ఈ నిఘా నిరంతరం



కొనసాగుతుంది. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

ఇలాంటి మోసపూరిత యాడ్స్ మీ దృష్టికి వచ్చినా లేదా మీరు మోసపోయినా, వెంటనే 1930 నంబరుకు కాల్ చేయండి లేదా ర్ట్ట్రజూం://ఞఎఎవతీఞతీఱఎవ.స్త్రశీజ.ఱఅ పోర్టల్‌లో ఫిర్యాదు చేయండి' అని సజ్జనార్ ట్వీట్ చేశారు.

# బంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలుసు

కోల్‌కతాపై దాడి చేస్తామంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్?కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పాకిస్థాన్ రెండు భాగాలుగా విడిపోయినప్పుడు వారు పర్యవసానాలను అనుభవించారని ఎద్దేవా చేశారు. కాబట్టి ఆయన అలాంటి రెచ్చగొట్టే ప్రకటనలు చేయకూడదని సూచించారు. వారు బంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని భాగాలుగా విడిపోతుందో ఆ దేవుడికే తెలుసని వ్యాఖ్యానించారు. "పాకిస్థాన్ రక్షణ మంత్రి అలాంటి రెచ్చగొట్టే ప్రకటన చేసి ఉండకూడదు. 55 ఏళ్ల క్రితం పాకిస్థాన్ రెండు భాగాలుగా విడిపోయినప్పుడు వారు దాని పర్యవసానాలను అనుభవించారు. వారు ఇప్పుడు బంగాల్?పై కన్నేస్తే, ఈసారి పాకిస్థాన్ ఎన్ని భాగాలుగా విడిపోతుందో దేవుడికే తెలియాలి." ఈ క్రమంలోనే 55 ఏళ్ల క్రితం పాకిస్థాన్? రెండుగా విడిపోయిన విషయాన్ని రాజ్?నాథ్? ప్రస్తావించారు. 1971లో జరిగిన యుద్ధంలో తూర్పు పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది. ఆ సమయంలో బంగ్లాదేశ్‌కు భారత సైన్యం అండగా నిలిచింది. అప్పట్లో పాక్ ఎన్నో పర్యవసానాలు ఎదుర్కొందని రాజ్‌నాథ్ గుర్తుచేశారు. ఈ సందర్భంగా రెండు పొరుగుదేశాల మధ్య ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌కు వార్నింగ్ ఇచ్చారు.

**కేంద్రంపై టీఎంసీ ఫైర్?**

మరోవైపు ఈ ఘటనపై టీఎంసీ కూడా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేసింది. కోల్‌కతాపై దాడి చేస్తామని పాకిస్థాన్



రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ బహిరంగంగా బెదిరించడాన్ని ఖండించే ధైర్యం లేదని ఆరోపించింది. ఎన్నికల సభలో మాట్లాడిన ఎంపీ అభిషేక్ బెనర్జీ, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "56 అంగుళాల ఛాతీ గల ప్రధానమంత్రి, ఆయన హోం మంత్రి ఓట్ల ప్రచారంలో ఎంతగా మునిగిపోయారంటే బంగాల్‌పై జరుగుతున్న ప్రత్యక్ష దురాక్రమణ బెదిరింపులకు స్పందించడానికి వారికి సమయం లేదు. పాకిస్థాన్ రక్షణ మంత్రి కోల్‌కతాపై దాడి చేస్తామని బహిరంగంగా బెదిరించారు. అయినా భారత యూనియన్‌లోని ఒక రాష్ట్రంపై, సార్వభౌమాధికారంపై జరిగిన ఈ ఘోరమైన దాడిని ఖండించే ధైర్యాన్ని నరేంద్ర మోదీకీ, అమిత్ షా గానీ లేదు. వారికి బంగాల్ ప్రజల ప్రాణాలు ఏమాత్రం లెక్కలేనట్టుగా ఉన్నాయి. వీరిద్దరు చాలా పిరికివాళ్లు. వారికి కనీసం కొద్దిపాటి ధైర్యం ఉన్నా, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి కేంద్ర బలగాలకు, బీఎస్ఎఫ్‌కు, భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛనివ్వాలి. నరేంద్ర మోదీకి ఆ ధైర్యం ఉందా? అమిత్ షాకు ఆ ధైర్యం ఉందా? రాజ్‌నాథ్ సింగ్‌కు ఆ ధైర్యం ఉందా?" అని ఆయన ప్రశ్నించారు.

**పాకిస్థాన్ రక్షణ మంత్రి పిచ్చి ప్రేలాపనలు**

కాగా కొద్ది రోజుల క్రితం భారత్‌పై పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి నోరుపారేసుకున్నారు. భవిష్యత్తులో భారత్ ఏదైనా దాడులకు పాల్పడితే కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పిచ్చి ప్రేలాపనలు చేశారు. ప్రతిదాడులను ఆ ప్రాంతం వరకూ తీసుకెళ్తామంటూ వ్యాఖ్యానించారు. ఎక్కడైనా కొంతమంది మృతదేహాలను పడేసి వారు ఉగ్రవాదులేనని నమ్మించేలా భారత్ బూటకపు ఆపరేషన్ రూపొందించినట్లు నివేదికలు ఉన్నాయంటూ అక్కసు వెళ్లగక్కారు. అయితే, తన వాదనలకు బలం చేకూర్చేలా ఖవాజా, ఎటువంటి ఆధారాలూ ఇవ్వకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని పొరుగు దేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇటీవల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. ఈ హెచ్చరికలపై ఖవాజా ఇప్పటికే తన అక్కసు వెళ్లగక్కారు. పహల్గాం ఘటన జరిగి ఏడాది కావస్తున్న నేపథ్యంలో భారత్ బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. తమపై జరిగే దాడులను తిప్పికొడతామని ఖవాజా మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు.

## ఐటీ కారిడార్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

**రూ. 1200 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం**

**8 ఎకరాల భూమిలో ఆక్రమణలు తొలగించిన హైడ్రా**

**భూమిని ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో చేర్చిన అధికారులు**




హైదరాబాద్, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ ఐటీ కారిడార్ లో భారీ ఆపరేషన్ నిర్వహించింది హైడ్రా. మంగళవారం ఖానామెట్ లో రూ. 12 వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చెర నుంచి కాపాడింది హైడ్రా. ఐటీ కారిడార్ కు చేరువలోని ఖానామెట్ లో 8 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించింది హైడ్రా. స్థానికుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఆక్రమణల కూల్చివేత చేపట్టారు. హైడ్రా కాపాడిన ప్రభుత్వ భూమి విలువ సుమారు రూ. 12 వందల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు అధికారులు. ఖానామెట్ లోని సర్వే నంబర్ 55లో ఉన్న ప్రభుత్వ భూమిలో భారీ ఆపరేషన్ చేపట్టారు హైడ్రా అధికారులు. ఈ స్థలంలో తాత్కాలిక షెడ్లు, నిర్మాణాలు తొలగించారు హైడ్రా అధికారులు. హైడ్రా వార్నింగ్ తో ఆర్‌సీసీ ప్లాంట్‌ను స్వయంగా తొలగించింది ప్రభుత్వ భూమిని ఆక్రమించిన నిర్మాణ సంస్థ. ప్రభుత్వ భూమిలో కార్మికుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించిన హైడ్రా మొత్తం భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేసి అసైన్డ్ ల్యాండ్‌గా గుర్తించి, ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో నమోదు చేసినట్లు తెలిపారు అధికారులు. రియల్ ఎస్టేట్ సంస్థల తప్పుడు క్లెయిమ్‌లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు అధికారులు.

## ఐపీఎల్ ఫార్మాట్‌తో ఏడాదికి రూ. 2400 కోట్ల నష్టం

**74 మ్యాచ్‌లేనా.. 94 మ్యాచ్‌లు నిర్వహించాలి**

**లలిత్ మోడీ డిమాండ్**

**బీసీసీఐ తీరుపై లలిత్ మోడీ తీవ్ర అసహనం**

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్): ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) నిర్వహణపై మరోసారి పెద్ద ఎత్తున చర్చ చెలరేగింది. బీసీసీఐ విధానాలపై ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోడీ తీవ్రంగా మండిపడ్డారు. బీసీసీఐ తీసుకున్న నిర్ణయాలతో ఏడాదికి రూ.2400 కోట్ల వరకు ఈ లీగ్ కి నష్టం వాటిల్లుతోందని ఆయన చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. ప్రస్తుతం లీగ్‌లో 10 టీమ్స్ ఉన్నప్పటికీ కేవలం 74 మ్యాచ్‌లతోనే టోర్నమెంట్ నిర్వహిస్తున్నారని తెలిపారు. అసలు ఈ ఫార్మాట్ ప్రకారం ప్రతి జట్టు ఒకే ప్రత్యర్థితో రెండేసి మ్యాచ్‌లు ఆడితే లీగ్ దశలోనే 90 మ్యాచ్‌లు, ప్లే ఆఫ్స్ కలిపి మొత్తం 94 మ్యాచ్‌లు జరగాల్సి ఉందని లలిత్ మోడీ పేర్కొన్నారు. కొద్ది కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆదరణ పొందిన టీ20 లీగ్ గా ఐపీఎల్ చరిత్ర నెలకొల్పింది. ఇటీవలే ఈ టోర్నీ ప్రసార హక్కులు ఏకంగా రూ.48,390 కోట్లకు అమ్ముడుపోవడంతో పాటు ఈ సీజన్‌కు ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలు భారీ మొత్తానికి అమ్ముడైయ్యాయి. ఈ విషయంపై కూడా ఐపీఎల్ మాజీ చైర్మన్ లలిత్ మాట్లాడుతూ ఒక్కో మ్యాచ్‌కు మీడియా హక్కులతో భారీ ఆదాయం ఆర్జిస్తుంది. హోంగ్రౌండ్ తో పాటు బయటి స్టేడియాల్లో కూడా మ్యాచ్‌లు జరిగే విధానం అమలు చేస్తే అదనంగా వేల కోట్లు బీసీసీఐ అకౌంట్లో చేరేవి ఆ ఆదాయంలో సగం ఐపీఎల్ ఫ్రాంచైజీలకు వెళ్తుంది. దాంతో టీమ్స్ వ్యాల్యూ కూడా మరింత పెరుగుతుందని లలిత్ మోడీ వెల్లడించారు. ఇటీవల ఆర్సీబీ, రాజస్థాన్ జట్లు భారీ ధరకు అమ్ముడుపోవడం నాకు సంతోషంగా ఉంది. కానీ టీమ్స్ కి హామీ ఇచ్చిన ఫార్మాట్‌ను అమలు చేయకపోవడం వాణిజ్య ఒప్పందానికి విరుద్ధమని లలిత్ మోడీ తెలిపారు. ఐపీఎల్ ప్రారంభమైన తొలినాళ్లలో 8 జట్లు మాత్రమే ఉండగా ప్రతి టీమ్ హోంగ్రౌండ్ తో పాటు ఇతర స్టేడియాల్లో ఒకే ప్రత్యర్థితో రెండు మ్యాచ్‌లు తప్పనిసరిగా ఆడుతుండేవి కానీ ఇప్పుడు లీగ్‌లో 10 జట్లు ఉన్నాయి. తప్పకుండా 94 మ్యాచులు జరగాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 74 మ్యాచులు మాత్రమే జరుగుతున్నాయి. తగ్గిన 20 మ్యాచుల వలన ఒక్కో మ్యాచ్ కి వచ్చే రూ. 118 కోట్ల మీడియా రైట్స్ ఆదాయం పోతుంది. ఫ్రాంచైజీలు కూడా రూ. 120 కోట్ల చొప్పు నష్టపోతున్నారని ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోడీ చెప్పుకొచ్చారు.

## ఓటర్ల జాబితా నుంచి పేర్లను తలలో 'పేలు' మాదిరిగా ఏరిపారేశారు

ఓట్ల తొలగింపుపై బంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ తీవ్రస్థాయిలో స్పందించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) తర్వాత మతువా, మైనారిటీలకు చెందిన ఓట్లను ఈసీ తొలగించిందని ఆరోపించారు. ముర్షిదాబాద్, మాల్దా, ఉత్తర దినాజ్‌పుర్ వంటి గణనీయమైన మైనారిటీ జనాభా ఉన్న జిల్లాల్లో ఓటర్ల జాబితా నుంచి పేర్లను తలలో పేల మాదిరిగా ఏరివేస్తున్నారని మమతా ఆరోపించారు. అయితే, ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగించిన వారి పక్షాన టీఎంసీ న్యాయ పోరాటం చేస్తుందని ఆమె తెలిపారు. ఈ విషయంపై తాము సుప్రీంకోర్టులో బలంగా వాదనలు వినిపించడంతో దాదాపు 32 లక్షల పేర్లను ఈసీ ఓటరు జాబితాలో తిరిగి చేర్చిందని చెప్పారు. అలాగే, జాబితాలో పేర్లు లేని వారు ట్రైబ్యునల్ ఎదుట హాజరవ్వాలని సూచించారు. నాదియా జిల్లాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మమతా ఈ మేరకు వ్యాఖ్యానించారు. అలాగే, చొరబాట్లపై కేంద్ర వైఖరిని మమతా ప్రశ్నించారు. దేశ సరిహద్దులను రక్షించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని మమత స్పష్టం చేశారు. ఈ విషయంలో కేంద్రం, తమ ప్రభుత్వాన్ని నిందించడం సరికాదని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ సహా హక్కులను కాపాడుకునేందుకు బంగాల్ పౌరులంతా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అలాగే త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు బంగాల్ ప్రజల గౌరవాన్ని, గుర్తింపును కాపాడే పోరాటమని అభివర్ణించారు. ఇదిలా ఉండగా, ఎస్ఐఆర్ ప్రక్రియ అనంతరం బంగాల్? ఓటర్ల జాబితా నుంచి దాదాపు 91 లక్షల మంది ఓటర్లను తొలగించారు. అయితే, రాష్ట్రానికి సంబంధించి తుది జాబితా ఇంకా ప్రకటించాల్సి ఉంది. అయితే, ఈ విషయంలో కేంద్రం వివక్ష చూపుతోందని, నిర్దిష్ట వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగిస్తున్నారని మమతా ఆరోపించారు. ఎలక్షన్ కమిషన్ విడుదల చేసిన డేటా ప్రకారం, గత ఏడాది అక్టోబర్ చివరి నాటికి గుర్తించిన 7.66 కోట్ల మంది ఓటర్ల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుంటే, ప్రస్తుతానికి రాష్ట్రంలో జరిగిన మొత్తం తొలగింపుల శాతం 11.85 శాతానికి పైగా ఉన్నాయి. అలాగే, ఎస్?ఐఆర్? ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన మొత్తం తొలగింపుల సంఖ్య 90.83 లక్షలకు పైగా ఉంది. పరిశీలనలో ఉన్న 60.06 లక్షల మంది ఓటర్లలో దాదాపు 27.16 లక్షల మందిని జాబితా నుంచి తొలగించినట్లు ఈసీ గణాంకాలు వెల్లడించాయి.

మరోవైపు, ముస్లిం జనాభా అధికంగా ఉన్న ముర్షిదాబాద్ జిల్లాలో అత్యధిక తొలగింపులు నమోదైనట్లు గణాంకాలు తెలిపాయి. ఈ జిల్లాలో న్యాయపరమైన పరిశీలనలో ఉన్న 11.01 లక్షల పేర్లలో 4.55 లక్షలకు పైగా పేర్లను జాబితా నుంచి తొలగించారు. దీనితో ఆ జిల్లాలో పరిశీలనలో ఉన్న ఓటర్ల తొలగింపు శాతం సుమారు 41.33 శాతానికి చేరింది. అలాగే, బంగ్లాదేశ్ సరిహద్దులో ఉన్న ఉత్తర 24 పరగణాల జిల్లాలో కూడా గణనీయమైన తొలగింపులు నమోదయ్యాయి. ఇక్కడ పరిశీలనలో ఉన్న 5.91 లక్షల మంది ఓటర్లలో 3.25 లక్షలకు పైగా ఓటర్లు ఓటు వేయడానికి అర్హులు కాదని తేలింది. అలాగే మాల్దా జిల్లాలో న్యాయపరమైన సమీక్షలో ఉన్న 8.28 లక్షల మంది ఓటర్లలో 2.39 లక్షలకు పైగా ఓటర్లను జాబితా నుండి తొలగించారు. అలాగే, న్యాయపరమైన పరిశీలన ప్రక్రియ పూర్తయిన అనంతరం దక్షిణ 24 పరగణాల జిల్లాలో తొలగింపుల సంఖ్య దాదాపు 2.23 లక్షలు, తూర్పు బర్ధమాన్ జిల్లాలో 2.09 లక్షలు, నాదియా జిల్లాలో 2.98 లక్షలుగా నమోదైనట్లు ఎన్నికల సంఘం గణాంకాలు పేర్కొన్నాయి.

## సంపాదకీయం

# కలవరం గురిచేస్తోన్న ఆకునూరి నివేదిక

ప్రతి ఊరికి ఒక గుడి ఉంటుందో లేదో కానీ బడి మాత్రం ఉంటుంది. బడి ప్రాధాన్యత అలాంటిది. ఒకవేళ ప్రభుత్వ పాఠశాల కానీ ప్రైవేటు పాఠశాల కానీ లేకపోయినా కనీసం ఆ ఊర్లో ఎవరో చదువుకున్న వ్యక్తి అయినా నలుగురిని కూర్చోబెట్టుకుని ఏదో నేర్పుతుంటాడు. చదువుకు అనాది నుండి అదే ప్రాముఖ్యత. ఎవరైనా తాము చదివిన బడిని, పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను అంత తొందరగా మరువలేరు. బడి పట్ల అభిమానం, గురువుల పట్ల గౌరవం ఏనాడు తరగవు. బడితో ఉండే అనుబంధం చిరకాలం నిలుస్తుంది. చిన్ననాటి బడి గురువులు కనపడగానే సహజంగానే మనసు గతం లోతుల్లోకి వెళ్లిపోతుంది. మన తెలంగాణ విద్యా కమిషన్ ఊళ్ళలోని పాఠశాలలను విలీనం చేసి ప్రతి మండలంలో విద్యార్థుల సంఖ్యను బట్టి మూడు లేదా నాలుగు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయమని సిఫార్సు చేయగా రాష్ట్ర ప్రభుత్వం అందుకు అంగీకరించి నిధులు కేటాయించి రంగంలోనికి దిగుతున్నది. మనం చిన్నతనంలో చదువుకున్న ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత, సెకండరీ పాఠశాలలన్నీ కలిసిపోయి ఒకే పాఠశాలగా ఇంటర్మీడియట్‌వరకు నడుస్తాయట. వివిధ యాజమాన్యాలతో నేడు నడుస్తున్న 28 రకాల పాఠశాలలన్నీ మాయమై మూడు లేదా నాలుగు రకాలు మాత్రమే మనకు కనబడతాయి. అంతేకాదు ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా క్రమంగా తగ్గిపోయి కాలక్రమంలో కాంట్రాక్టు టీచర్లే ఈ పబ్లిక్ స్కూల్స్‌లో పాఠాలు చెప్తారు. జూనియర్ కళాశాలలు, ఇంటర్మీడియట్ బోర్డు కూడా రద్దు కాబోతున్నాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి వార్షిక పరీక్షలు కూడా ఉండవు. ఈ పెను మార్పులన్నీ విద్యా విధానాన్ని ఏం చేస్తాయో కానీ మొత్తం మీద ఒక గందరగోళ పరిస్థితి మాత్రం ప్రస్తుతం నెలకొని ఉంది. ఇంటర్మీడియట్ తర్వాత ఇంజినీరింగ్, అగ్రికల్చర్ బిఎస్‌సి, ఫార్మసీ లాంటి కోర్సులు చదవడానికి కూడా ప్రవేశ పరీక్షలు ఉండవు. కేవలం ఇంటర్‌లో మార్కుల ప్రాతిపదికన సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఇక భవిష్యత్తులో గురుకులాల సంఖ్య పెరగబోదు. అవి అలాగే కొనసాగితే సంతోషించాల్సిన పరిస్థితి. తెలంగాణ విద్యా కమిషన్ ఆకునూరి మురళి అనే ఒక ఐఎఎస్ అధికారి నేతృత్వంలోని టీం రాష్ట్రంలోని 35 పాఠశాలలు తిరిగి తల్లిదండ్రులతో, విద్యార్థులతో సమావేశాలు జరిపి 54 సెమినార్లు నిర్వహించి ఐదు రాష్ట్రాలు, మూడు విదేశాలు పర్యటించి దాదాపు 18 నెలల కాలంలో ఇచ్చిన నివేదికలో 434 సిఫార్సులు చేసి విద్యావేత్తలను, ఉపాధ్యాయ సంఘాలను, ముఖ్యంగా విద్యాభిమానులను ఆశ్చర్యములో నేకాక ఆగ్రహానికి గురిచేసింది. ప్రభుత్వ విద్యను, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని, ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు మంగళం పాడుతామని ప్రభుత్వం పదేపదే చెప్పడమే కానీ గత రెండున్నర ఏళ్లలో అందుకు చేసిందేమీ లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు లక్షల్లో తగ్గుతుండగా, ప్రైవేటు రంగంలోని బడులలో అవి అదే సంఖ్యలో పెరగడం గమనార్హం. గత పదిహేళ్లుగా ఎన్నో విజయాలు సాధించి ఉచిత, నాణ్యమైన విద్యను అందిస్తూ పివి నరసింహారావు ఆలోచనలకు, ఎన్‌టి రామారావు ఆశయాలకు అనుగుణంగా నడిచి ఐఐటి, మెడిసిన్ సీట్లు గణనీయంగా సాధిస్తూ ఇటు క్రీడారంగంలో కూడా దేశానికి అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించి పెట్టిన గురుకులాలకు నేడు ఆదరణ కరువై కునారిల్లుతున్నాయి. ఆకునూరి కమిటీ నివేదిక విద్యారంగంలో కలకలాన్ని సృష్టించింది. ప్రభుత్వ రంగంలో నేటి వరకు పూర్వ ప్రాథమిక పాఠశాలలు లేవు. పల్లెల్లో అంగన్వాడీలు ఉన్నాయి. అన్ని పాఠశాలలనూ విలీనం చేస్తే పూర్వ ప్రాథమిక నుండి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో నిర్వహించడం అనేక వయసుల వారు అంటే మూడేళ్ల నుండి 17 ఏళ్ల వరకు విద్యార్థులు ఒకే చోట విద్యాభ్యాసం చేయడం సబబేనా? ఆరోగ్యకర వాతావరణం సాధ్యమేనా? కేవలం భవనాలతో రంగులతో, హంగులతో నాణ్యమైన విద్య ఇవ్వగలరా? కార్పొరేట్ వ్యవస్థలో ఇరుకు గదులలో గాలి వెలుతురు లేకుండా క్రీడా మైదానం ఇతర కృత్యాలు లేకుండా ఫలితాలు రావడం లేదా? వాటిని మనం సమర్థించడం లేదు. కానీ నాణ్యత కోసం వేల కోట్ల రూపాయల ఖర్చు కంటే ఒక 1000 కోట్లు కేటాయించి ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ బాగు చేయవచ్చు. బలోపేతం చేయడం అంటే విలీనం చేసి ఒకేచోట విద్యాభ్యాసం ఏర్పాటు చేయడమేనా? గురువులకు జీతాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని తగ్గించాలని, వారికి పదోన్నతులు వద్దని చెప్పడం ఒకరకంగా గురువులకు పంగనామాలు పెట్టడమే. సమాజానికి మార్గదర్శి అయిన గురువు ప్రాధాన్యతను తగ్గించి అవమానించడమే. కాంట్రాక్టు టీచర్లు ఎంత సామర్థ్యం కలిగి ఉన్నా తక్కువ జీతానికి అభద్రతాభావంతో వారు పనిచేయడం కూడా అనుమానాస్పదమే. జాతీయస్థాయిలో అద్భుతాలు సృష్టిస్తున్న ఇంటర్మీడియట్ బోర్డును రద్దుచేసి పాఠశాల విద్యలో విలీనం చేయవలసిన అవసరం లేదు కదా! అంటే నూతన విద్యా విధానాన్ని మన ప్రభుత్వం అనుసరించబోతున్నదా? చిన్ననాటి నుండి ఆంగ్ల మాధ్యమం కూడా అర్థంలేని సిఫారసు. భావ నిర్మాణం మాతృభాషలోనే సాధ్యమని అనేక కమిటీలు విధానాలు ఘోషిస్తున్నాయి. పాఠశాలలో తప్ప మిగిలిన జీవితంలో మనం మాట్లాడేది మాతృభాష మాత్రమే. అంతేకాదు గిరిజన భాషలకు కూడా ముప్పు ఏర్పడవచ్చు. ఆంగ్ల మాధ్యమాన్ని 5 నుండి లేదా 8వ తరగతి నుండి ఐచ్ఛికం చేయవచ్చు. అసలు ఆంగ్ల మాధ్యమంలో బోధించే నైపుణ్యం గల ఉపాధ్యాయులు చాలినంత మంది ఉన్నారా? శిక్షణ ఇచ్చినంత మాత్రాన రోజుల్లోనే నైపుణ్యం వస్తుందా? ప్రతిరోజు విద్యార్థులు ప్రయాణం చేయడం రిస్క్‌తో కూడిన పని. 24 గంటలు క్యాంపస్‌లో ఉంటేనే ఊహించని ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు వేల పాఠశాలల నిర్మాణం ఎన్ని సంవత్సరాలకు జరిగేను? ఒకవేళ ప్రభుత్వాలు మారితే ఈ విధానం ఈ బడులు నిలిచేనా? రూ. 20 వేల కోట్లతో నిర్మించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఎవరికోసం? ఈ విలీనం విద్యా వికాసానికా లేక విధ్వంసానికా అనేది విద్యావేత్తలు ముఖ్యంగా ఉపాధ్యాయుల సందేహం. గిరిజన బిడ్డల భవితవ్యం ఏమిటి? ఏం కాబోతున్నది? గ్రామీణ నిరుపేదలు చదువుకు మరింత దూరం అవుతారా అనే ఆందోళన ప్రజల్లో ఉంది. విద్యకు 18 శాతం బడ్జెట్ కేటాయింపు చేయాలన్న సిఫార్సు అందరికీ ఆమోదయోగ్యమే కానీ ప్రభుత్వానికి అది ఆచరణ సాధ్యం కాదు. అందుకే 2026- 27 బడ్జెట్లో 8.2% కేటాయించి తన ఉద్దేశాన్ని చాటిచెప్పింది.కమిషన్ ఆలోచనలు ఆకాశంలో ఉండగా ప్రభుత్వ చేతలు పాతాళంలో ఉన్నాయి. విద్యార్థుల ఆశలు, తల్లిదండ్రుల ఆకాంక్షలు ఉపాధ్యాయుల భవిష్యత్తు త్రిశంకు స్వర్గంలో వేలాడుతున్నాయి. రాబోయే రోజుల్లో ఉపాధ్యాయుల కంటే బోధనేతర సిబ్బందికే ఎక్కువ జీతాలు సిఫార్సు చేయడం ద్వారా ఈ కమిషన్ ఉపాధ్యాయుల శ్రమ దోపిడీకి ఎర్రతివాచీ పరిచినట్లుగానే భావించాలి. మానవ వనరుల అభివృద్ధి జరగాలంటే ఉపాధ్యాయులకు సంతృప్తికరమైన వేతనాలు ఉండాలి. అనేక దేశాల్లో ఉపాధ్యాయుల వేతనాలు అత్యధికంగా ఉన్నాయి. కానీ కమిషన్ వాటిని పరిశీలనలోనికి తీసుకోలేదు. తన పరిధి దాటి కమిషన్ వేతనాల గురించి వ్యాఖ్యానించడం అభ్యంతరకరం. ఉపాధ్యాయ శిక్షణలను మరింత పక్కాగా నడిపించాలి అనేది ఒప్పుకోదగిన అంశం. ఇంటర్ తర్వాత వృత్తి విద్యా కోర్సులకు ప్రవేశ పరీక్ష వద్దు అని చెప్పడం ప్రైవేటు రంగానికి మార్గం మరింత సుగమం చేస్తున్నది. ఇంతకాలంగా వృత్తి విద్యా కోర్సులు చదవడానికి పేద విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో లబ్ధి పొందుతున్నారు. ఇప్పుడు ఆ పథకాన్ని తీసివేయాలని చెప్పడం పేద విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు దూరం చేయడమే. డిగ్రీ గురుకులాలను రద్దు చేయాలనడం సంక్షేమ విద్యార్థుల ఉన్నత విద్య ఆశయాలకు అడ్డుకట్ట వేయడమే. ప్రజలకు, వారి నివాసాలకు విద్యాలయాలు అందుబాటులో ఉండాలనే ప్రాథమిక సూత్రాన్ని కమిషన్ ఉల్లంఘించినట్లు స్పష్టం అవుతున్నది. అంటే కమిషన్ సభ్యులు యుజిసి నిబంధనలు అధిగమించి ప్రామాణికంగా ఉన్న కొఠారి కమిషన్ సూత్రాలను పక్కనపెట్టి విద్యా హక్కు చట్టాన్ని పరిగణనలోనికి తీసుకోకుండా నివేదిక తయారు చేశారా అనే ప్రశ్న ఉదయిస్తున్నది. 350 పేజీల నివేదిక ఇన్ని ప్రశ్నలకు అనుమానాలకు తావు ఇచ్చే రీతిలో తయారు చేశారు. దీనివల్ల మరిన్ని సమస్యలు ఉత్పన్నం కాబోతున్నాయి. ఆలోచనల స్థాయిలోనే ఇన్ని సమస్యలు ఉండగా, అమలులో ఇంకెన్ని సమస్యలు రాబోతున్నాయో? ఉపాధ్యాయ సంఘాలను వారి సలహాలను పరిగణనలోనికి తీసుకోకుండా ఈ నివేదిక తయారైందని సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు.


# స్థానిక ఎన్నికలతోనే ప్రజాస్వామ్యం బలోపేతం


ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అనేవి ప్రజల ఆకాంక్షలకు, పరిపాలనా పారదర్శకతకు అద్దం పట్టే కీలక యంత్రాంగాలు. ముఖ్యంగా స్థానిక సంస్థలైన మున్సిపల్ ఎన్నికలు క్షేత్రస్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయి. అయితే, ఈ ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వ యంత్రాంగం చూపే ఆర్థిక లెక్కలు, వాస్తవ వ్యయాల మధ్య కనిపిస్తున్న అగాధం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు నుండి ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యే వరకు ప్రతి దశలోనూ వేల కోట్ల ప్రజాధనం వ్యయం అవుతున్నప్పటికీ, అందులో పారదర్శకత కొరవడటం ఆందోళనకరం. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎంత ఖర్చు చేయాలి, వారి ప్రచార వ్యయం ఎంత ఉండాలి అనే అంశాలపై నిశితంగా నిఘా ఉంచే ఎన్నికల సంఘం, అదే ఎన్నికలను నిర్వహిస్తున్న అధికారుల ఖర్చుల విషయంలో మౌనం వహించడం లేదా ఉదాసీనంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యంలోని వైరుధ్యాన్ని ఎత్తిచూపుతోంది. అభ్యర్థుల ఖర్చును నియంత్రించే యంత్రాంగం, అధికార యంత్రాంగం చేస్తున్న అనవసర వ్యయాలను, అక్రమ మళ్లింపులను ఎందుకు ప్రశ్నించడం లేదనేది ఒక అపరిష్కృత ప్రశ్నగా మిగిలి పోయింది. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ప్రధానంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, శిక్షణ, భద్రత, ఈవీఎంల రవాణా, ఓటర్ల అవగాహన వంటి విభాగాలకు భారీగా నిధులు కేటాయిస్తారు. మున్సిపల్ ఎన్నికల కోసం లక్షలాది రూపాయలు ఖర్చు అవుతున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అయితే, క్షేత్రస్థాయి పరిశీలనలు మరియు ఆడిట్ నిపుణుల విశ్లేషణల ప్రకారం, ఇందులో కనీసం 30 నుండి 40 శాతం మేర వ్యత్యాసం ఉంటున్నట్లు తెలుస్తోంది. ఉదాహరణకు, ఒక పోలింగ్ కేంద్రం వద్ద కనీస సౌకర్యాలైన తాగునీరు, ఫర్నిచర్, విద్యుత్, పారిశుధ్యం కోసం కేటాయించినట్లు కాగితాలపై రాస్తారు. కానీ వాస్తవానికి అక్కడ కనీసం సౌకర్యాలు కూడా ఉండవు. తాత్కాలిక షామియానాలు, కుర్చీల అద్దెల పేరుతో మార్కెట్ ధర కంటే అత్యధికంగా బిల్లులు సృష్టించడం పరిపాటిగా మారింది. ఇలా లక్షల వరకు అక్రమ మళ్లింపు జరుగుతోందని అంచనా. ఇలాంటి చిన్న చిన్న వ్యత్యాసాలే రాష్ట్రవ్యాప్తంగా వందల కోట్ల రూపాయల అవినీతికి దారితీస్తున్నాయి. శిక్షణా తరగతుల పేరుతో ఏర్పాటు చేసే భోజన వసతులు, స్టేషనరీ కొనుగోళ్లలో కూడా భారీగా



కమిషన్లు చేతులు మారుతున్నాయి. భద్రతా ఏర్పాట్ల పేరుతో జరిగే వ్యయం మరీ విడ్డూరంగా ఉంటుంది. పోలీసు బలగాల రవాణా కోసం వాహనాల అద్దె, ఇంధనం పేరుతో చూపే ఖర్చులు ఆడిట్ పరిధిలోకి రాకపోవడం అవినీతికి రాజమార్గంగా మారుతోంది. ఒకే వాహనాన్ని రెండు మూడు విభాగాలకు వినియోగించినట్లు చూపి, వేర్వేరుగా బిల్లులు డ్రా చేయడం వంటి సంఘటనలు గతంలో అనేక ఆడిట్ నివేదికల్లో వెలుగుచూశాయి. అత్యవసర పరిస్థితి అనే సాకుతో టెండర్లు పిలవకుండానే నామినేషన్ పద్ధతిలో పనులు అప్పగించడం వల్ల ఖర్చు అమాంతం పెరుగుతోంది. ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఎన్నికల సంఘం అభ్యర్థులపై చూపే కఠినత్వం అధికారుల విషయంలో లేకపోవడం. అభ్యర్థి ప్రచార రథం ఖర్చు, టీ కప్పుల ఖర్చు, జెండాల సంఖ్యను లెక్కించే పరిశీలకులు, ఎన్నికల నిర్వహణలో జరుగుతున్న ప్రజాధనం దుర్వినియో గాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదన్నది చర్చనీయాంశం. అభ్యర్థి ఖర్చుకు పరిమితి విధించడం వెనుక ఉన్న ఉద్దేశం “సమాన అవకాశాలు” కల్పించడం అయితే, అధికారుల అడ్డగోలు ఖర్చులను నియంత్రించడం వెనుక ఉన్న ఉద్దేశం “ప్రజాధన రక్షణ” కావాలి. కానీ, ఎన్నికల సమయం ముగియగానే యంత్రాంగం అంతా పద్దులను సర్దడంలో నిమగ్నమవుతుంది తప్ప, వాటిపై స్వతంత్ర సంస్థలతో విచారణ జరిపించిన దాఖలాలు తక్కువ. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (అంఉ) వంటి సంస్థలు సాధారణంగా వార్షిక ఆడిట్ చేస్తాయి కానీ, ఎన్నికల వంటి ప్రత్యేక సందర్భాల కోసం ప్రత్యేకమైన, వేగవంతమైన ఆడిట్ వ్యవస్థ లేకపోవడం పెద్ద లోపం. రాష్ట్ర ఎన్నికల సంఘాలు ఈ వ్యయాలపై కచ్చితమైన మార్గదర్శకాలను జారీ చేయాల్సిన అవసరం ఉంది. ఓటర్ల అవగాహన కార్యక్రమాల పేరుతో జరిగే ఖర్చు కూడా ఒక ప్రహసనంగా మారింది. హోర్డింగులు, గోడ పత్రికలు, ప్రచార వాహనాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు చూపిస్తున్నా, అవి కేవలం ప్రధాన కార్యాలయాలకే పరిమితం అవుతున్నాయి. మారుమూల వార్డుల్లో ఓటర్లకు కనీస సమాచారం కూడా అందడం లేదు. డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ద్వారా తక్కువ ఖర్చుతో అవగాహన కల్పించే అవకాశం ఉన్నప్పటికీ, పాత పద్ధతిలో కాంట్రాక్టర్లకు మేలు చేసేలా భారీ వ్యయంతో కూడిన ప్రకటనలకే అధికారులు మొగ్గు చూపుతున్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఇఒఎ) రక్షణ, నిల్వ కోసం ఉపయోగించే స్ట్రాంగ్ రూమ్‌ల అద్దెలు, అక్కడ ఏర్పాటు చేసే సీసీటీవీల ఖర్చులు మార్కెట్ ధర కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా ఉండటం వ్యవస్థాత్మక అవినీతికి నిదర్శనం. ఈ రకమైన వ్యయాల వల్ల ప్రభుత్వ ఖజానాపై అనవసర భారం పడటమే కాకుండా, పరిపాలనా యంత్రాంగంపై ప్రజల్లో ఉన్న నమ్మకం సడలుతోంది. ఈ దుస్థితిని మార్చాలంటే సమూల ప్రక్షాళన అవసరం. ప్రతి మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణ కోసం కేటాయించిన బడ్జెట్ మరియు ఖర్చు చేసిన వివరాలను “ఓపెన్ డేటా” విధానంలో ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఎన్నికల నిర్వహణ ఖర్చుపై ఒక స్వతంత్ర ఆడిట్ కమిటీని నియమించి, ఫలితాలు వెలువడిన 30 రోజుల్లోపు నివేదికను బహిర్గతం చేయాలి. అభ్యర్థుల వ్యయాన్ని పర్యవేక్షించేందుకు నియమించినట్లుగానే, అధికార యంత్రాంగం ఖర్చును పర్యవేక్షించేందుకు “వ్యయ పరిశీలకులను” నియమించాలి. టెక్నాలజీని ఉపయోగించి ప్రతి కొనుగోలును ఈ-ప్రొక్యూర్మెంట్ ద్వారానే జరపాలి. ఒకవేళ ఏ అధికారి అయినా నిధులను దుర్వినియోగం చేసినట్లు తేలితే, వారిపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. అప్పుడే ఎన్నికల నిర్వహణలో పారదర్శకత పెరుగుతుంది. ప్రజాస్వామ్య విలువలు కాపాడబడాలంటే అటు అభ్యర్థులు, ఇటు అధికారులు ఇద్దరూ జవాబుదారీగా ఉండాలి. ప్రజాధనం ప్రజల అవసరాల కోసం ఖర్చు కావాలి కానీ, ఎన్నికల పేరిట అధికారుల జేబులు నింపడానికి కాదు. చైతన్యవంతమైన సమాజం ఈ వ్యత్యాసాలను ప్రశ్నించినప్పుడే నిజమైన మార్పు సాధ్యమవుతుంది.

# యువతకు మేల్కొలుపు మంగళ్‌పాండే ఆత్మత్యాగం





బ్రిటిష్ పాలన నుంచి విముక్తి కోసం అలనాడు జరిగిన పోరాటంలో ఎందరో ధీరులు ప్రాణాలర్పించారు. తెల్లదొరలపై యుద్ధాన్ని ప్రకటించిన తొలి స్వాతంత్ర్య సమర యోధుడు మంగళ్ పాండే. ప్రాణాలకు లెక్కచేయక బ్రిటీష్ వారి మీద తుపాకీ ఎక్కు పెట్టిన ధైర్యవంతుడు. బ్రిటిష్ వారి పెత్తనానికి తలవొగ్గి వారు చేస్తున్న అరాచకాలు, అవమానాలు మౌనంగా భరించిన భారతీయుల ఆలోచనలను స్వేచ్ఛా స్వాతంత్ర్యాల వైపు మళ్లించిన ఘనత మంగళ్ పాండేదే. బ్రిటిష్ పాలన నుండి దేశాన్ని విడిపించేందుకు తన ప్రాణాలను అర్పించిన స్వాతంత్ర్య సమరయోధుడుగా మంగల్ పాండే భారత చరిత్రలో నిలిచి పోయాడు. 1857 నాటి తిరుగుబాటులో అతను కీలక పాత్ర పోషించాడు. మూడుపదుల వయసుకు చేరకుండానే ఉరికంబం ఎక్కేందుకు ఏ మాత్రం వెనకడుగు వేయని ధైర్యవంతుడు, తన త్యాగం దేశంలోని యువతను మేల్కొలుపు తుందని, విశ్వసించాడు. తన ఆత్మ బలిదానం మరెందరో వీరులకు స్ఫూర్తిని కలిగిస్తుందని, అలా స్ఫూర్తిని పొంది భరతమాత దాస్య విముక్తికి అంకితం అవుతారని, ఆ దిశగా యత్నం చేస్తారని భావించాడు. సుమారు రెండు శతాబ్దాలు మన దేశాన్ని పాలించిన శ్వేత జాతీయులపై తిరుగు బాటును ప్రకటించిన తొలి స్వాతంత్ర్య సమర యోధుడు మంగళ్ పాండే. మంగళ్ పాండే 1827 జూలై 19 న నేటి ఉత్తరప్రదేశ్ నందు గల ఫైజాబాద్ జిల్లాలోని సుర్హపుర అను గ్రామంలో ఒక సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. 22 సంవత్సరాల వయసులో మంగళ్ పాండే తనకు తెలిసిన వ్యక్తి ద్వారా తాను సిపాయిగా చేరాడు. శిక్షణ అనంతరం పాండేని 34 బెంగాల్ రెజిమెంట్ లోని 6వ కంపెనీకి సిపాయిగా పంపించారు. సెలవులకు ఇళ్లకు వెళ్లి వచ్చిన సైనికుల ద్వారా బ్రిటీషు వారి దోపిడీలు, దేశమంతటా చెలరేగుతున్న స్వాతంత్ర్య ఉద్యమం గురించి వార్తలు అందుతుండేవి. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న స్థానిక పాలకులు సంఘటితంగా బ్రిటిషు వారిపై 1857 మే 31 న తిరుగుబాటు జరపాలని నిర్ణయించుకున్నారు. ఈ తిరుగు బాటుకు నాయకత్వం వహించిన వారిలో ఝాన్సీ రాణి లక్ష్మిబాయి, తాంతియా తోపే, బహుదూర్ షా తదితరులు ఉండిరి. తుపాకీ తూటాల తయారీలో గోవు, పంది కొవ్వు వాడుతున్న విషయం సైనికులకి తెలిసి లోలోపల రగిలి పోయారు. గోమాంసం వాడకం గురించి తెలుసుకున్న మంగళ్ పాండే ఉడికిపోయి, తోటి సైనికులతో తిరుగు బాటుకు పథకం వేశాడు. ఈ విషయం బ్రిటిషు అధికారులు మార్చి 29 న గుర్తించారు. తమ తమ తుపాకీలని సిద్ధంగా ఉంచుకొని, కన్పించిన బ్రిటిషు అధికారినల్లా కాల్చి పారేయాలని తోటి సైనికులందర్నీ ఉత్తేజ పర్చాడు పాండే . ఈ లోగా అధికారి వాగ్ రావటం మంగళ పాండే అతనిమీద తూటా పేల్చటం జరిగింది, కానీ అది గురితప్పి అతని గుర్రానికి తగిలింది. చేతి పిస్టల్ తో కాల్పులు జరిపాడు వాగ్. తప్పించుకున్న మంగళ్ పాండే తిరగబడి, తన తుపాకీ తో కొట్టబోయాడు. అప్పటికే చేరుకున్న శార్జంట్ హ్యూసన్ వచ్చి పాండే చేతిలోని తుపాకీని నెట్టి పారేశాడు. పాండే ని అరెస్ట్ చేయమని అధికారులు ఆదేశించినా ఎవ్వరూ ముందుకు రాలేదు. తెల్లవారి చేతికి చిక్కటం ఇష్టం లేక, తన తుపాకీతో తానే కాల్చుకాగా, ఆ బుల్లెట్ గాయం చేసింది కానీ ప్రాణం తీయలేదు. తర్వాత భయంతో అతన్ని బ్రిటిషు అధికారులు సమీపించి ఆస్పత్రికి తరలించారు. వారం రోజుల్లో కోలుకున్న మంగళ్ పాండే మీద రాజద్రోహం, తిరుగుబాటు నేరాలు మోపి కోర్టులో హాజరు పరిచారు. వీలైనంత త్వరగా విచారణ ముగించటం, ఉరిశిక్ష విధించటం ఆంగ్లేయ పాలకుల దుర్నీతికి పరాకాష్ఠ. విచారణలో మంగళ్ పాండే ధైర్యంగా ఇలా ప్రకటించాడు... “నేను చేసిన తిరుగుబాటు నా దేశం కోసం, నా ధర్మం కోసం చేశాను. ఇది నా స్వప్రేరణతో నా మాతృభూమి కోసం చేశాను, అంతే కానీ దీనికి మరెవ్వరినీ బాధ్యులని చేయొద్దు”. విచారణ పూర్తిచేసి, ఏప్రిల్ 18న ఉరితీయాలని ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటికే తిరుగుబాటు వార్త వ్యాపించి, అనేక రెజిమెంట్లలో చైతన్యం మొదలయ్యింది. మరోవైపు అనేక రాజ సంస్థానాలు, సంస్థానాల్లోని ప్రజలు తిరుగుబాటుకు ఏకమయ్యారు. భారత దేశమంతా ప్రథమ స్వతంత్ర్య సంగ్రామానికి తెర లేచింది. మంగళ్ పాండే ఉరి ప్రభావంతో సైనికుల్ని అణచి వేయటానికి ఏప్రిల్ 8 నే ఉరిశిక్షను అమలు చేశారు. మంగల్ పాండే ప్రభావమున్న సైనిక కంపెనీని పూర్తిగా రద్దు చేశారు. 2005 లో మంగళ్ పాండే పై ఒక హిందీ సినిమా తీసారు. భారత ప్రభుత్వం మంగళ్ పాండే గౌరవార్థం, అక్టోబరు 5, 1984 న ఒక తపాళా బిళ్ళను విడుదల చేసింది. భారత దేశ స్వాతంత్ర్య పోరాటపు తొలిసారి తిరుగుబాటు బావుటా ఎగురవేసిన వీరుడు మంగళ్ పాండే. 1857 నాటి తిరుగు బాటుకు మూలమై, బ్రిటీష్ సిపాయిగా పనిచేస్తూ బ్రిటీష్ పాలకుల మీద తిరుగు బాటు చేసిన సాహసిగా, తొలి స్వాతంత్ర్య సమర యోధుడిగా పాండే చిరకాలం గుర్తుండి పోతాడు.

# రెడ్డి గణపతిని పరామర్శించిన ముదిరాజ్ సంఘం నేతలు

**ముదిరాజ్ మహాసభ నేతలకు అండగా ఉంటాం**

**జిల్లా అధ్యక్షుడు ఏర్ల వెంకన్న**

**త్వరగా కోలుకోవాలని బృందం ఆకాంక్ష**

**ములుగు జిల్లా, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):**

ముదిరాజ్ ములుగు జిల్లా నాయకులు రెడ్డి గణపతిని మంగళవారం ముదిరాజ్ మహాసభ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏర్ల వెంకన్న పరామర్శించారు. గత కొద్ది రోజులుగా ప్రమాదవశాత్తు అనారోగ్యంతో బాధపడుతూ, ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న రెడ్డి గణపతిని ఆయన నివాసంలో మంగళవారం వెంకన్న కలిశారు. ఈ సందర్భంగా గణపతి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఏర్ల వెంకన్న, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సంఘం కార్యకలాపాల్లో చురుగ్గా ఉండే నాయకులకు సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడితో పాటు ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి మెట్టు సురేష్ యాదవ్, రాష్ట్ర నాయకులు బుల్లెట్ ఓదెలు, బెస్త సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డోలు



రమేష్ మరియు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరాలి

**మహబూబాబాద్ జిల్లా, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):**

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ సూచించారు. టీ ప్రైడ్, తెలంగాణ ఐపాస్ వంటి పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేయాలని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి పరిశ్రమల పెట్టుబడుల ప్రమోషన్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఐపాస్ చట్టం, టీ ప్రైడ్ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో టీజీ ఐపాస్ చట్టం కింద వివిధ శాఖల నుండి అనుమతులు పొందేందుకు 30 యూనిట్లు ?36.90 కోట్ల పెట్టుబడితో దరఖాస్తు చేసుకున్నాయని తెలిపారు. అందులో 64 అనుమతులు ఇప్పటికే మంజూరు చేసినట్లు చెప్పారు. టీ ప్రైడ్ పథకం ద్వారా 2025 నవంబర్ 1 నుండి 2026 ఏప్రిల్ 7 వరకు కాలంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు వాహనాల మంజూరు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో ఎస్టీ వర్గానికి 42 యూనిట్లకు ?1,34,18,564 సబ్సిడీ, ఎస్సీ వర్గానికి 1 యూనిట్‌కు ?1,36,500 సబ్సిడీ మంజూరు చేసినట్లు చెప్పారు. అలాగే మొత్తం 43 పరిశ్రమలకు పెట్టుబడి రాయితీలకు కమిటీ అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నుండి ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనారిటీ అన్ని వర్గాల యువత కోసం ఎన్నో సంక్షేమ పథకాలను



ప్రవేశపెట్టి అమలు చేస్తుందని, అట్టి అవకాశాలను యువతీ యువకులు వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని ఆమే సూచించారు, అందుకోసం సంబంధిత విభాగాల సిబ్బంది ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీమన్నారాయణ రెడ్డి, విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ విజయేందర్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు దేశీ రామ్ నాయక్, శ్రీనివాస్ రావు, కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్, ఫ్యాక్టరీస్ శాఖ, కమర్షియల్ టాక్స్ శాఖ, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సాయి చరణ్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రతినిధులు, టౌన్ ప్లానింగ్ అధికారి తారక్ సాయి, సిబ్బంది ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యమే ప్రథమ కర్తవ్యం

**శాస్త్ర విజ్ఞానంతో మెరుగైన వైద్య సేవలు అందించాలి**

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**

**ములుగు జిల్లా, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):**

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రథమ కర్తవ్యం అని శాస్త్ర విజ్ఞానంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరోగ్య అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి డి ఎల్ ఆర్ ఫంక్షన్ హాల్ వరకు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన ఫ్లకార్డ్ నినాదాలతో కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2026 ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా "ఆరోగ్యం కోసం కలిసి, శాస్త్రానికి మద్దతుగా నిలబడండి (టోగెథెర్ ఫర్ హెల్త్ . స్టాండ్ విత్ సైన్స్)" అనే థీమ్ తో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. విజ్ఞాన శాస్త్రంతో కలిసి ఆరోగ్యం కోసం ఐక్యంగా ఉందాం అనే ఈ సంవత్సరం థీమ్ తో ఐక్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేసే అందరిని ఆరోగ్యవంతులుగా తయారు చేయాలని తప్పనతో పని చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, వ్యాయామం పోషకాహారము మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం దురవాలాట్లకు దూరంగా ఉండడం మొదలగు ఆరోగ్య సూత్రాలను పాటించాలని ప్రజలను కోరారు. అపోహలు, మూఢ నమ్మకాలకు దూరంగా ఉంటూ, శాస్త్రపరమైన అవగాహనతో ముందుకు సాగితేనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. ఆరోగ్య సిబ్బందితోపాటు




ప్రజాప్రతినిధులు యువజన సంఘం నాయకులు మహిళా సంఘ ప్రతినిధులు వారి వారి బాధ్యతగా ప్రజలకు అవగాహన కల్పించి ఆరోగ్యం పట్ల ప్రజలు శ్రద్ధ వహించేటట్లు చూడాలని విజ్ఞాన శాస్త్రం రోజురోజుకి పెరిగిపోతుందని దానికనుగుణంగా ములుగు జిల్లాలో గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ మెడికల్ కాలేజ్ లాంటి సంస్థలలో ప్రావీణ్యులైన డాక్టర్లు పనిచేస్తున్నారని వారి సేవలను వారి సూచనలను ప్రజలు పాటించి ఆరోగ్యవంతులుగా తయారవుతారని విశ్వసించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ప్రతి గ్రామంలో ఆరోగ్యం గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సిబ్బందిని కోరారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీలో పోషకాహార ప్రాముఖ్యతను దురవాలవాట్ల కలిగే అనారోగ్యాన్ని ఆరోగ్య సూత్రాలు పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను ఆరోగ్య సిబ్బంది మెడికల్ కాలేజ్ విద్యార్థులు నర్సింగ్ కాలేజ్ విద్యార్థినీలు ఆరోగ్య కార్యకర్తలు మరియు ఆశా కార్యకర్తలు నినాదాలతో గవర్నమెంట్ జనరల్ హాస్పటల్ ములుగు నుండి డీ ఎల్ ఆర్ ఫంక్షన్ హాల్ ములుగు వరకు ర్యాలీని నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. అటు తరువాత ములుగు జిల్లా సాంస్కృతిక కళాజాత బృందం ఆరోగ్య సూత్రాల మీద పాటలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డి సి హెచ్ ఎస్ డాక్టర్ జగదీశ్వర్ ములుగు మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ అసోసియేటెడ్ ప్రొఫెసర్స్ జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీకాంత్ డాక్టర్ నాగ అనేష్, మున్సిపాలిటీ కమిషనర్ రమేష్, మాస్ మీడియా అధికారి సంపత్ ప్రోగ్రాం మానిటరింగ్ సూపర్వైజర్స్ వెంకట్ రెడ్డి సురేష్ బాబు , ఫార్మసీ డిస్టిక్ స్టోర్ ఇన్చార్జ్ వినోదర్ హెచ్ ఇ తిరుపతయ్య, ప్రజా ప్రతినిధులు, మెడికల్ కాలేజ్ ట్యూటర్స్, టి. ఎస్.ఎస్. కళాకారుల బృందం, పోలీస్ అధికారులు ములుగు మెడికల్ కాలేజ్ విద్యార్థిని విద్యార్థులు నర్సింగ్ కాలేజ్ విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.

## మన ఇసుక వాహనం పథకంపై అవగాహన



**మహబూబాబాద్ జిల్లా, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):**

మంగళవారం కలెక్టరేట్ టీజీ స్వాన్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం మందిరంలో జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా మైనింగ్ అధికారి, మండలాల తహసీల్దారులకు, పంచాయతీ సెక్రటరీలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన ఇసుక వాహనం ఆన్లైన్ ద్వారా ఇసుక కేటాయింపులు, తదితర అంశాలపై సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ద్వారా టెక్నికల్ అసిస్టెంట్ నరేష్ శిక్షణ తరగతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ప్రకారం ఇక పై పూర్తి స్థాయిలో ఇసుక సరఫరా కోసం ఆన్లైన్ ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలని, అందుకు మన ఇసుక వాహనం పథకంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏ డి మైనింగ్ వెంకటరమణ, డిపిఓ హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఈ.వి.యం. గోదాం నెలవారి తనిఖీ నిర్వహన

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



**ములుగు జిల్లా, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్)**

ఈ.వి.యం. గోదాం ను జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్. నెలవారి తనిఖీ నిర్వహించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాము వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను తనిఖీ చేశారు. గోదాంలో అమర్చిన సీసీ కెమెరాల పనితీరును, అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తుగా ఏర్పాటు చేసిన ఫైర్ ఫైర్ ఎక్స్టింగిషర్ ను ఇతర అగ్నిమాపక పరికరాలను తనిఖీ చేశారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. గోదాం వద్ద ఉన్న పోలీస్ బందోబస్తును మరియు రిజిస్టర్లను కలెక్టర తనిఖీ చేశారు. భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం వహించకూడదని సెక్యూరిటీ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన ఈవీఎంల భద్రత విషయంలో అత్యంత పారదర్శకతను పాటిస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనే గోదాం తనిఖీ చేయడం జరిగిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరిండెంట్ ఎండి సలీం, డిప్యూటీ తాహసిల్దార్ నితీష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ మనోహర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 2 లోపు ఉద్యోగుల హామీలను అమలు చేయాలి

**లేదంటే సాముహిక నిరాహార దీక్ష కి మేం సిద్ధం**

**పిఆర్టియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి**




**హైదరాబాద్, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):**

మంగళవారం హైదరాబాద్ ముషీరాబాగ్ రెవిన్యూ భవనంలో టీజీజాక్ సమావేశం చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావు ల అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పి ఆర్ టి యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రావుల కార్ వెంకటేష్ లు పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో ఉద్యోగుల ఇచ్చిన హామీ ప్రకారం పి ఆర్ సి ప్రకటించాలని, పెండింగ్ డి ఏ, పెన్షనర్ బెనిఫిట్స్, నగదు రహిత వైద్యం,317 జీ ఓ నీ పూర్తిగా రద్దు చేయాలని, కాంట్రిబ్యూషనరీ పెన్షన్ స్కీమ్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అన్నారు. ముఖ్యంగా ఇచ్చిన పై హామీలను అమలు చేయకుంటే ఏప్రిల్ 17 నాడు నల్లబ్యాడ్జీ లతో నిరసన కార్యక్రమం,మే 5 నాడు జిల్లా కేంద్రాల్లో సాముహిక నిరసన కార్యక్రమం చేపడతామని అన్నారు. ఈ సమావేశంలో వివిధ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల తో పాటు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# డబ్బు కావాలంటే అడ్డాకూలీలుగా మారండి

- భూ కబ్జాలు కాదు
- నియోజకవర్గానికో ఏఐ సెంటర్ పెట్టొచ్చు
- రేవంత్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఆరెస్పి ఫైర్



**హైదరాబాద్, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి డబ్బు సంపాదించాలని ఉంటే, న్యాయబద్ధంగా సంపాదించాలని, భూ కబ్జా చేయడం ద్వారా కాదని, అవసరమైతే ఎల్.బి నగర్ చౌరస్తా, బోడుప్పల్ చౌరస్తా వద్ద అడ్డాకూలాలాలుగా పని చేసి,షాపింగ్ మాల్స్ లో సేల్స్ మెన్ గా పనిచేసి సంపాదించుకోవాలని, రాష్ట్ర ప్రజల ఆస్తిని దోచుకుంటే ఊరుకునేది లేదని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. ఈ రోజు తెలంగాణ భవన్ లో ఎమ్మెల్సీ డా.దాసోజు శ్రవణ్ తో కలిసి పత్రికా సమావేశంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ హై కోర్టు, భారత సుప్రీం కోర్టు, భూ సంస్కరణల చట్టాన్ని ఉల్లంఘిస్తూ, స్వయంగా తెలంగాణ ముఖ్యమంత్రి,రెవెన్యూ శాఖ మంత్రి భూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నాదర్ గుల్ లో 374 ఎకరాలు ప్రభుత్వ భూమేనని హైకోర్టు చెప్పినప్పటికీ వినకుండా దౌర్జన్యంగా అధికారులను బెదిరించి భూ కబ్జాకు పాల్పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ అనేక సంవత్సరాలుగా భూమిని సాగు చేస్తున్న రైతులు వస్తే,ప్రైవేట్ బౌన్సర్లనుపెట్టి దాడులకు పాల్పడటాన్ని వ్యతిరేకించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమీషనర్, జిల్లా ఆర్డీవో, ఆదిబట్ల ఇన్స్పెక్టర్ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఫెన్సింగ్ వేసి కబ్జాకు పాల్పడుతుంటే, పోలీసులు ఎస్ఓపి సెక్షన్ 30 ప్రకారం సుమోటో కేసుగా నమోదు చేసి ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుమారుడు హర్ష రెడ్డి డైరెక్టర్ గా ఉన్న కంపెనీ భూ కబ్జాకు పాల్పడుతుంటే, పోలీసులు అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని అడిగారు. అధికారులు రెవెన్యూ మంత్రి కుమ్మక్కై, ముఖ్యమంత్రి సహకారంతో ప్రభుత్వ విలువైన భూములను లాక్కుంటున్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి రేవంత్ రెడ్డి ప్రణాళిక బద్ధంగా ముఖ్యమంత్రి, హోంశాఖ, మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖలు దగ్గర పెట్టుకున్నారని, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెవెన్యూశాఖ, పౌరసరఫరాల శాఖ దగ్గర పెట్టుకొని, ప్రజలకు ఎవరికీ తెలియకుండా లక్షల కోట్ల కుంభకోణాలకు పాల్పడుతున్నారన్నారు. లగచర్ల, వెలుగుమట్ల, కొత్వాల్ గూడ,నానక్ రాం గూడ, పరిగి, రేగడి దోస్వాడ, హిల్ట్, మూసీ వంటి ప్రాంతాల్లో కబ్జాలకు పాల్పడుతున్నారని తెలిపారు. నిన్న నాదర్ గుల్ భూములకు సంబంధించి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడకుండా, కంపెనీలతో ప్రెస్ మీట్ పెట్టించారని,అక్కడ విలేకర్ల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పోయారని, దమ్ముంటే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పూర్తి వివరాలతో చర్చకు రావాలని సవాల్ విసిరారు. పాలేరు, గాంధీభవన్, ప్రెస్ క్లబ్ ఎక్కడికైనా రావడానికి సిద్ధమేనని స్పష్టం చేశారు. నాదర్ గుల్ లో ప్రభుత్వం లాక్కోవాలని చూస్తున్న 7 వేల కోట్లు ప్రజలకోసం ఉపయోగిస్తే, ప్రజలకు 1,32,000 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించవచ్చు, 7 లక్షల ఎకరాలను సాగు చేస్తున్న 9 లక్షల రైతులకు రుణమాఫీ చేయవచ్చని, ఒక్కొక్క పౌరునికి రూ.500 ఇచ్చి,అన్ని టెస్టులు చేసి ప్రజలు మరణాల బారిన పడకుండా కాపాడవచ్చని గుండె, లివర్, బిపి, షుగర్ వంటి టెస్టులు చేయించవచ్చని, ఒక్కో పౌరునికి స్మార్ట్ వాచ్, షూస్ ఇచ్చి,ఆరోగ్యం కాపాడవచ్చని,రాష్ట్ర వ్యాప్తంగా 1400 నుండి 3500 స్పోర్ట్స్ అకాడమీలు పెట్టి, సిరాజ్,రొనాల్డో, నిఖత్ జరీన్ లను తయారుచేయవచ్చని, 40 లక్షల మంది నిరుద్యోగుల కోసం మండలాల్లో ఎసి కోచింగ్ సెంటర్లు పెట్టవచ్చు. బీహార్ వాల్లు రైల్వే ఉద్యోగాలు పొందుతున్నట్టు మనం కూడా అన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా చేయవచ్చు, 1,40,000 లైబ్రరీలు కట్టవచ్చు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సెంటర్లు ప్రతి నియోజకవర్గంలో పెట్టొచ్చని, విదేశాలకు వెళ్లే విద్యార్థులకు 2,80,000 మందికి సాయం చేయొచ్చని, వారు నెలకు 1000 ఇచ్చినా 2800 కోట్ల ఆదాయం వస్తుందని వివరించారు. కానీ ఇన్ని అవకాశాలు ఉన్నా, కేవలం ముఖ్యమంత్రి, రెవెన్యూశాఖ మంత్రి కలిసి 7 వేల కోట్లు తమ జేబులో వేసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. భూసంస్కరణ చట్టం సెక్షన్ 28 ప్రకారం, సీలింగ్ యాక్ట్ ప్రకారం ఒకవేళ ప్రైవేట్ వ్యక్తులకు చెందిన భూమి అయితే 54 ఎకరాల కంటే ఎక్కువ ఉన్న మిగిలిన 320 ఎకరాల భూమిని కాపాడాలని అధికారులకు సూచించారు. అధికారులే ఫైల్స్ పై సంతకాలు చేయాల్సి ఉంటుందని,ప్రభుత్వం మారిన తర్వాత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, తమిళనాడులో 9 మంది పోలీసులకు మరణశిక్ష విధించినట్టుగానే, భూ కబ్జాలకు సహకరిస్తున్న అధికారులపై కూడా చట్ట పరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. అధికారులకు 72 గంటల సమయం ఇస్తున్నాం, వెంటనే భూ కబ్జాకు పాల్పడుతున్న వారిని అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైడ్రా అధికారులు అమీన్ పూర్ భూమిని కాపాడినట్టుగానే నాదర్ గుల్ భూమిని ఎందుకు కాపాడడంలేదని నిలదీశారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజల ఆయుష్షు 1 సంవత్సరం 2 నెలలు తగ్గిందన్నారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించకుండా, తీవ్రమైన ఒత్తిడి, అసహనం, భయాందోళనకు గురిచేయడం వల్ల కార్డియాల్ హార్మోన్ అదుపులో లేక స్టిరాయిడ్స్ విడుదలై ప్రజల ఆయువు తగ్గిందన్నారు. అదే కేసిఆర్ పాలనలో మిషన్ భగీరథ,కళ్యాణలక్ష్మి,కెసిఆర్ కిట్,రైతు బంధు, రైతు భరోసా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాల వల్ల ప్రజల ఆయుర్దాయం 2,3 ఏళ్లు పెరిగిందని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రజలు, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండి,ఈ భూ కబ్జాలపై రీల్స్, షాట్స్ చేసి ప్రభుత్వ విధానాలను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఇది కేవలం నాదర్ గుల్ సమస్య కాదని,ఆదిలాబాద్, అలంపూర్ రైతులు కూడా స్పందించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న ఆదిలాబాద్ లో మాట్లాడుతూ ప్రజలకు ఏడవ గ్యారంటీ కింద స్వేచ్ఛ,స్వాతంత్ర్యం ఇచ్చామని, ప్రజలకు ఏమైనా మాట్లాడవచ్చు, ఎక్కడైనా తిరగవచ్చు అని చెప్పి, 24 గంటలైనా గడవకముందే పరిగి భూ బాధితులను కలవడానికి వెళ్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావులను అక్రమంగా అరెస్ట్ చేసి బాధితుల పక్షాన మాట్లాడకుండా, వారిని కలగకుండా గొంతునొక్కుతున్నారని మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అభిలాష్ రావు,శ్రీనివాస్ యాదవ్, నర్సింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్య పరిరక్షణలో ఆశా కార్యకర్తల సేవలు అమూల్యమైనవి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):**
మంగళవారం టేకుమట్ల మండలం వెలిశాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆశా కార్యకర్తలకు ఆశా డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11వ తేదీ వరకు ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వాటిని పక్కడ్బందీగా అమలు చేయాలని వైద్య సిబ్బందికి ఆయన సూచించారు. ఆశా కార్యకర్తలు గ్రామ, మండల స్థాయిలో గర్భిణిలు సుఖ ప్రసవాలు జరిగేలా, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ మాతా శిశు మరణాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి ఆసుపత్రిలో ఎంతమందికి వైద్య సేవలు అందిస్తున్నారు, ఏ ఏ ప్రాంతాల నుండి వైద్య సేవలకు వస్తున్నారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు 70 మంది వరకు వైద్య సేవలకు వస్తున్నారని వైద్యులు తెలుపగా ఓపి సేవలు పెంచాలని సూచించారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పోషణ లోపం ఉన్న చిన్నారులు ఎంత మంది ఉన్నారు అని అడిగి తెలుసుకున్నారు. పోషణ లోపం ఉన్న చిన్నారులు లేరని తెలుపగా అభినందించారు. గ్రామం, మండలం వారిగా పోషణ లోపం ఉన్న చిన్నారుల జాభితా తయారు చేయాలని సూచించారు. బాల్యం నుండి ఆరోగ్యవంతమైన సమాజం తయారు కావాలని స్పష్టం చేసారు. ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగహన కల్పించాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబొరేటరీని పరిశీలించి, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పరీక్షల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ స్వరూప రాణి, ఎంపీడీవో అనిత, వైద్యులు డాక్టర్ నాగరాణి, హారిక, సర్పంచ్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యంపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):**
ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పాల్వంచ వైద్య ఆరోగ్య శాఖ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంగా ఉన్న జిల్లాలో ప్రజలకు నాణ్యమైన మరియు అందుబాటులో ఉన్న వైద్య సేవలను అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడం అత్యంత కీలకమని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ నమ్మకాన్ని నిలబెట్టడం ప్రతి అధికారి, సిబ్బందిపై ఉన్న బాధ్యతగా తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 6 నుండి 11వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇతర జిల్లాలతో పోలిస్తే ఈ జిల్లాలో ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు ఉన్న నమ్మకం విశేషమని తెలిపారు . క్షేత్రస్థాయిలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రాష్ట్ర స్థాయి అవార్డులను స్వీకరించేందుకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతికి వెళ్లినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయితో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కూడా అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి తుకారాం రాథోడ్ మాట్లాడుతూ, జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు మరియు ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 43 మంది ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దారు దారా ప్రసాద్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ ప్రసాద్ నాయక్, డాక్టర్ స్పందన, డాక్టర్ తేజస్వి, వైద్య శాఖ సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉనికి కోల్పోతున్నామని కాంగ్రెస్ నాయకులు ఉలికిపడుతున్నారు

## మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ నాయకులు జోరిక రమేష్



**హనుమకొండ, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):**
భారత రాష్ట్ర సమితి పార్టీ తరపున కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ గురించి దాస్యం వినయ్ భాస్కర్, బీఆర్ఎస్ పోరాడింది. ఇదే అంశాన్ని పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో వినయ్ భాస్కర్ ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వినయ్ భాస్కర్ ప్రశ్నలకు ఉలిక్కిపడి ఇక్కడి కొందరు కాంగ్రెస్ నాయకులు ప్రెస్ మీట్ పెట్టి బీఆర్ఎస్ అభివృద్ధిని ప్రశ్నించారు. కేవలం 8 ఏండ్ల కాలంలో వినయ్ భాస్కర్ నాయకత్వంలో గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్, ఎస్ డీ ఎఫ్, సీఎం అష్యూరెన్స్ పరిధిలో కాజీపేట పరిధిలోని మూడు డివిజన్లకు కలిపి దాదాపు 100 కోట్ల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. నాయిని రాజేందర్ రెడ్డి ఏనాడైనా కాజీపేట బ్రిడ్జి దాటి వచ్చి కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కోసం ఉద్యమించారా అని ప్రశ్నిస్తున్నాం. కాజీపేట బ్రిడ్జ్ నిర్మాణం కోసం 75 కోట్లు మంజూరు చేసి 80 శాతం పనులు పూర్తి చేస్తే మిగిలిన 10, 20 శాతం పనులు పూర్తి చేసేందుకు రెండున్నరేళ్లు తీసుకుంటున్నది మీరు కాదా అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో కాజీపేట బ్రిడ్జి పూర్తి చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పిన మనుషులు మీరు కాదా. నాయిని రాజేందర్ రెడ్డి బ్రిడ్జి నిర్మాణం త్వరిత గతిన పూర్తవుతున్నాయని చెబుతున్నారు. కానీ బ్రిడ్జి పనులు రెండున్నరేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. పాత బ్రిడ్జిని పట్టించుకోకపోవడం పోగా నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిపై తుమ్మ చెట్లు, జిల్లేడు చెట్లు మొలిచాయి. నిన్న ఒక సోదరి మాట్లాడుతూ మైనార్టీలకు స్మశాన వాటిక లేదు అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుసుల్ ఖానా కట్టించింది దాస్యం వినయ్ భాస్కర్. కాజీపేట పరిధిలోని విద్యార్థుల కోసం ఐటీఐ కాలేజీ, పాఠశాల విద్యార్థుల కోసం సర్కారు బడుల ఆధునీకీకరణ, మండల రీసోర్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. రైల్వే వారితో మాట్లాడి స్థానికులకు ఉపాధి కల్పించారు. కాజీపేట చౌరస్తా బ్యూటిఫికేషన్ నిధులు వచ్చింది మా హయాంలో కాదా. ఇక కాజీపేట పరిధిలోని 47వ డివిజన్‌లో 157 అభివృద్ధి పనులకు గాను 9 ఏండ్లలో 20 కోట్ల రూపాయలు, సంక్షేమ పథకాల అమలు చేస్తూ దాదాపు 600 మందికి 18 కోట్ల రూపాయల లబ్ధి నేరుగా జరిగింది. 62వ డివిజన్ పరిధిలో 147 అభివృద్ధి పనులకు గాను 15 కోట్లు, 900 మంది సంక్షేమ లబ్ధిదారులకు నేరుగా 13 కోట్ల లబ్ధి నేరుగా అందజేయడం జరిగింది. 63వ డివిజన్ పరిధిలో 70 అభివృద్ధి పనులకు గాను 10 కోట్లు, 950 మంది సంక్షేమ లబ్ధిదారులకు నేరుగా 17 కోట్ల రూపాయలను వారికి అందజేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుంది. నాయిని రాజేందర్ రెడ్డి కి దమ్ము ఉంటే మరో నెల రోజుల్లో గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ సభ్యుల పదవీకాలం ముగియనుంది. విమర్శలకు ప్రాధాన్యత ఇవ్వకుండా గడువు ముగిసిన వెంటనే ఎన్నికలకు, ప్రజా తీర్పునకు వెళ్దాం. మీరు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమా.. కాజీపేట మీద అంత ప్రేమ ఉంటే రేపు జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కాజీపేట నుంచి మీ పార్టీ ప్రాతినిధ్యం ఇచ్చే వారినే మేయర్ గా చేస్తారా అని సూటిగా ప్రశ్నిస్తున్నా..? నాయిని రాజేందర్ రెడ్డి రెండున్నరేళ్లలో మూడు నాలుగు సార్లు అసెంబ్లీలో ప్రజా సమస్యలను ఏనాడైనా మాట్లాడారా...? మీ కాంగ్రెస్ నాయకులే మీ ఎమ్మెల్యేను చూసి నవ్వుకుంటున్నారు. విమర్శించేందుకే ముందుకు వస్తున్న కాంగ్రెస్ నాయకులు 6 గ్యారంటీలు ప్రజలకు ఎందుకు అందించడం లేదు, అందించేందుకు ఎందుకు కృషి చేయడం లేదు... ప్రజల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే 6 గ్యారంటీలు అమలు చేయండి. సీనియర్ నాయకులు నార్లగిరి రమేష్ మాట్లాడుతూ... స్టంట్ స్టార్ నాయిని రాజేందర్ రెడ్డి చేసేది తక్కువ, ప్రచారం చేసుకునేది ఎక్కువ, స్థానిక ఎమ్మెల్యే మెప్పుకోసం ఇక్కడి కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారు. అవాకులు చెవాకులు పేలుతున్నారు. బీఆర్ఎస్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి అనేక కార్యక్రమాలు వినయ్ భాస్కర్ గారు 10 ఏండ్ల కాలంలో చేపట్టారు. మీ రెండున్నరేళ్ల పాలనలో కేవలం సీసీ రోడ్లు, డ్రెయినేజీలు తప్ప చేసిందేమిటీ.. మేము కట్టించిన కమ్యూనిటీ హాళ్లలో మీ మీటింగ్‌లు పెట్టుకుంటున్నారు. కాజీపేట బస్టాండ్ వచ్చింది వచ్చింది అంటున్నారు. రెండున్నరేళ్లైనా అతీగతి లేదు. నాయిని రాజేందర్ రెడ్డి నగరం అంతా ఫెక్సీలు పెట్టుకున్నారు. అందులోని అండర్ గ్రౌడ్ డ్రైనేజీ అయ్యిందా..? మొన్న బడ్జెట్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రస్థావనే లేదు, సిగ్గు లేదు అబద్ధాలు అడుతున్నందుకు, కాజీపేట బ్రిడ్జి పూర్తి అయ్యిందా..? కేయూ ప్రహరీ పూర్తి అయ్యిందా.. ఏం చేయకుండానే ప్రచారం చేసుకునే స్టంట్ స్టార్ నాయిని రాజేందర్ రెడ్డి, పనులు తక్కువ ప్రచారాలు ఎక్కువ, నాయిని రాజేందర్ రెడ్డి అసమర్థత కారణంగా వినయ్ భాస్కర్ కొట్లాడి సాధించిన కాజీపేట ఐటీఐ కాలేజీ ములుగు రోడ్డుకు తరలిపోయింది. కనీసం వేల మంది విద్యార్థులకు ఉపయోగపడే ఐటీఐ కళాశాలకు కేవలం 1 ఎకరం స్థలం కేటాయించకపోవడం నాయిని చేతకాని తనానికి నిదర్శనం. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగ రావు, డివిజన్ అధ్యక్షులు శివ కుమార్, సీనియర్ నాయకులు తండమళ్ల వేణు, నాయకులు దశరథం, బరిగెల వినయ్, మహమూద్, విజయ్, రాంచందర్, రాజేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో సీసీ కెమెరాల ఏర్పాటు

**భూపాలపల్లి, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):**
జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ ఆదేశాల మేరకు, నేర నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, ప్రజల భాగస్వామ్యంతో భద్రతను బలోపేతం చేయడం లక్ష్యంగా "నిఘా నేత్రం"తో పాటు కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను అమలు చేస్తున్నాము. ఈ క్రమంలో భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం బొమ్మపూర్ గ్రామంలో పోలీస్ ఆధ్వర్యంలో, గ్రామ ప్రజల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సీసీ కెమెరాల వ్యవస్థను కాటారం డీఎస్పీ సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలు--పోలీసుల మధ్య సమన్వయం పెరిగి, సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నివారణ మరియు విచారణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని తెలిపారు. గ్రామ ప్రజలు పోలీస్ శాఖకు అందించిన సహకారం అభినందనీయం. భద్రత అందరి బాధ్యతగా భావించి, ఇలాంటి కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాలని కోరారు.



# ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**హన్మకొండ జిల్లా, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):**

హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం హన్మకొండలోని ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలను ఆకస్మికంగా సందర్శించి, ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను సమగ్రంగా పరిశీలించారు. మొదటగా ఓపీ కౌంటర్ల వద్ద సేవల పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్, రిజిస్టర్ల నిర్వహణపై సమీక్ష చేశారు. అనంతరం ఫార్మసీని తనిఖీ చేసి, ఔషధాల నిల్వలు, పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా లేబర్ రూమ్, వార్డులు మరియు ఇతర విభాగాలను సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కొన్ని వార్డుల్లో స్వల్పంగా శుభ్రత లోపం గమనించిన కలెక్టర్, వెంటనే శుభ్రత ప్రమాణాలను మెరుగుపరచాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. వైద్య సేవల అమలు విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్, రోగులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలను సేకరించారు. వైద్య సిబ్బంది విధులకు సమయానికి హాజరు కావడంతో పాటు, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఆసుపత్రి క్యాంటీన్‌ను కూడా పరిశీలించిన కలెక్టర్, ఆహార పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా వంట నూనెను పునర్వినియోగం చేయవద్దని హెచ్చరించారు. మొత్తం ఆసుపత్రి నిర్వహణను మరింత సమర్థవంతంగా, శుభ్రతతో నిర్వహిస్తూ, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ఎంఓ డాక్టర్ మంజుల, డ్యూటీ డాక్టర్లు మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేసి ఆరోగ్య ఆదిలాబాదుగా తీర్చిదిద్దాలి




**ఆదిలాబాద్ :** ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేసి ఆరోగ్య ఆదిలాబాదుగా తీర్చిదిద్దాలనీ జిల్లా కలెక్టర్ రాజర్షిషా వైద్య శాఖ అధికారులకు సూచించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం స్థానిక రిమ్స్ ఆసుపత్రి ఆడిటోరియంలో నిర్వహించిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకల కార్యక్రమానికి ఆదిలాబాదు పార్లమెంటు సభ్యులు గోడం నగేష్, ఆదిలాబాదు నియోజకవర్గ శాసన సభ్యులు పాయల శంకర్ తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేసి ఆరోగ్య ఆదిలాబాదుగా తీర్చిదిద్దాలని, నిన్నటి నుండి ప్రారంభమైన ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా సేఫ్ మదర్ హుడ్, ఎయిడ్స్ నివారణ, ఆయుష్ వంటి అంశాలపై వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. రిమ్స్ ఆసుపత్రి జిల్లాకే కాకుండా పొరుగు రాష్ట్రాల ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని కొనియాడారు. ముఖ్యంగా సర్జికల్ ఆంకాలజీ విభాగంలో జరుగుతున్న శస్త్రచికిత్సలు, శిశు మరణాల రేటును తగ్గించేందుకు చేపట్టిన 'సంకల్ప' ప్రోగ్రామ్ ద్వారా రిమ్స్ కు జాతీయ స్థాయి గుర్తింపు, టీబీ నివారణలో జిల్లా యంత్రాంగం సాధించిన పురోగతికి గాను అవార్డులు రావడం అభినందనీయమన్నారు. పాఠశాల స్థాయి నుండే పిల్లలు గుట్కా, పాన్ మసాలా, మద్యం, గంజాయి వంటి అలవాట్లకు లోనవుతుండటం ఆందోళనకరమని, ఇటువంటి వారిని గుర్తించి రిమ్స్ లేదా స్వచ్ఛంద సంస్థలు నడిపే డి-అడిక్షన్ సెంటర్లలో చేర్పించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. అలాగే గర్భిణీ స్త్రీలలో రక్తహీనత (అనిమియా) సమస్య తీవ్రంగా ఉందని, అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను సక్రమంగా వాడేలా చూడాలన్నారు. ఆర్.ఎం.పిల వద్దకు వెళ్లి అనవసరమైన యాంటీబయాటిక్స్, ఇంజక్షన్లు తీసుకోవడం వల్ల కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందని, ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. వేసవి కాలం దృష్ట్యా ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, తగినంత నీరు తాగడం, 6 నుండి 7 గంటల నిద్ర, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ యోగా, వ్యాయామం వంటివి అలవర్చుకోవాలని సూచించారు. ఆదిలాబాదు పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ, మానవ జీవితం చాలా స్వల్పమైనదని, డబ్ల్యూహెచ్ఓ నివేదికల ప్రకారం సగటు జీవితకాలం 60 నుండి 70 ఏళ్లకు తగ్గిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా ఏప్రిల్ 7వ తేదీన ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒక ప్రత్యేక థీమ్‌తో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఇది కేవలం సంబరాల కోసం కాకుండా మన ఆరోగ్యంపై మనకు అవగాహన కలిగించే 'అలారం' వంటిదని పేర్కొన్నారు. నేటి సమాజంలో 30-40 ఏళ్లకే అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని, ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరిగితే ప్రభుత్వం వైద్యం కోసం చేసే భారీ ఖర్చు తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో పనిచేసే ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాత్ర కీలకమని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వైద్యులను ఎంతగానో నమ్ముతారని, వారికి సరైన అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాలలోని ఆర్ఎంపీలు ప్రథమ చికిత్సకు పరిమితం కాకుండా హై డోస్ మందులు, పెయిన్ కిల్లర్లు ఇవ్వడం వల్ల ప్రాణాపాయం సంభవిస్తోందని హెచ్చరించారు. గతంలో బజార్ హత్నూర్, గాదిగూడ వంటి మండలాల్లో కిడ్నీ సమస్యలతో పలువురు మృతి చెందడానికి విదేశాల నుండి వచ్చిన అనర్హులైన వ్యక్తులు చేసే వైద్యమే కారణమని గుర్తు చేశారు. యువత గంజాయి, గుట్కా, సిగరెట్లు వంటి వ్యసనాలకు బానిసలవుతున్నారని, దీనిపై కఠిన నియంత్రణ అవసరమని పేర్కొన్నారు. శారీరక, మానసిక దృఢత్వం కోసం ప్రతి ఒక్కరూ నడక, యోగా ధ్యానం వంటి అలవాట్లను జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం, ప్రజలు భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తూ అందరికీ ప్రపంచ ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో మనిషి ఏ రంగంలో ఉన్నా విపరీతమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒత్తిడి నుండి బయటపడాలన్నా, ఆరోగ్యంగా ఉండాలన్నా మనం తీసుకునే ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, నడక వంటి అంశాలను సమన్వయం చేసుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు. భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరం యోగా అని, 2014-15లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యోగా ప్రాముఖ్యతను ప్రపంచ వేదికలపై చాటిచెప్పినప్పుడు మొదట్లో కొందరు విమర్శించారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అయితే, ఐక్యరాజ్యసమితిలో యోగాను గుర్తించిన తర్వాత, శాస్త్రీయంగా దీనివల్ల మందుల వాడకం దాదాపు 44 శాతం తగ్గిందని అనేక పరిశోధనలు నిరూపిస్తున్నాయని వివరించారు. యోగాను అలవరచుకోవడం ద్వారా సుమారు 50 నుండి 60 శాతం వరకు రోగాల బారిన పడకుండా ఉండవచ్చని, ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, తప్పనిసరిగా సమయానికి ఆహారం, నిద్ర తీసుకోవాలని సూచించారు. బయట ఫుడ్ తీసుకోకుండా ఆరోగ్య పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా టిబి నియంత్రణపై ప్రతిజ్ఞ చేసి, ఆయుష్ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. తదుపరి ఉత్తమ వైద్య సేవలు అందించిన పలువురు వైద్యులకు, సిబ్బందికి, నిక్షయ మిత్రాలకు కలెక్టర్, ఎంపీ ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం నూతన టిబి ఎక్స్ రే యంత్రాన్ని కలెక్టర్, ఎంపీ ఆవిష్కరించి, టిబి వ్యాధిగ్రస్థులకు నిక్షయా పోషన్ కిట్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, లీగల్ అడ్వైజర్ దాసరి గంగారం, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు వసతులు సద్వినియోగం చేసుకోవాలి

**రాజన్న సిరిసిల్ల** ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు వేములవాడ పట్టణంలోని మహాత్మాజ్యోతి బాపూలే బాలికల రెసిడెన్షియల్ విద్యాలయంలో కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయం ఆవరణ, తరగతి గదులు, కిచెన్ లో ఆహార పదార్థాలను పరిశీలించారు. మెనూ చార్ట్ పరిశీలించి.. ఏ ఏ వంటకాలు సిద్ధం చేస్తున్నారో తనిఖీ చేశారు. ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, తమ కుటుంబంలో పిల్లలకు ఆహార పదార్థాలు ఎలా సిద్ధం చేస్తారో అలాగే ఇక్కడ విద్యార్థుల కోసం వండాలని ఆదేశించారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులతో కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. అన్ని పరీక్షలకు సంబంధించిన టైమ్ టేబుల్ సిద్ధం చేసుకోవాలని, ఏ రోజు ఏ సబ్జెక్ట్ చదవాలో ముందే రాసుకోవాలని, దానికి అనుగుణంగా అన్ని సబ్జెక్టులు చదవడం, రాయడం పూర్తి చేయాలని తెలిపారు. రైటింగ్ కూడా సాధన చేయాలని, వార్షిక పరీక్షల సమయానికి అనుగుణంగా ఇప్పుడు అదే సమయంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసేలా సాధన చేయాలని పేర్కొన్నారు. ఇప్పటి మార్కులు మీరు తర్వాత చదివే ఉన్నత తరగతులకు ఎంతో కీలకమని స్పష్టం చేశారు. విద్యార్థులం దరూ రానున్న పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఏ నేపథ్యం నుంచి వచ్చినా.. ఇప్పుడు ఇష్టపడి సాధన చేయడం.. అన్ని సబ్జెక్టుల్లో రాణించడంతో వారి భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడాలని, ఉన్నత స్థానాల్లో నిలవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**వరంగల్ జిల్లా, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. వరంగల్ నగరంలోని ఇందిరా నగర్ (గరీబ్ నగర్) జిడబ్లుఎంసి 16వ వార్డులో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను సందర్శించిన కలెక్టర్, పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణం ఎంతవరకు పూర్తయ్యింది, ఇప్పటివరకు ఎంతమేర నిధులు విడుదలయ్యాయి అనే విషయాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్మాణ పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 20 నుండి 26 వరకు సామూహిక గృహప్రవేశ కార్యక్రమాలను నిర్వహించనున్న నేపథ్యంలో, లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట ఇందిరమ్మ ఇళ్ల జిల్లా నోడల్ అధికారి, జెడ్పి సీఈవో రామ్ రెడ్డి, హౌసింగ్ డి.ఇ. విష్ణువర్ధన్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## భూ భారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**ఈ - ఆఫీస్ వినియోగాన్ని పెంచి, పరిపాలనలో పారదర్శకత సాధించాలి**
**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ జిల్లా, ఏప్రిల్ 07 (తీన్మార్ న్యూస్):**

మంగళవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో భూ భారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియపై క్షుణ్ణంగా సమీక్షించి, పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతిలో గల వివిధ మాడ్యూల్స్ లోని సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్, కోర్టు కేసులు, జీపీపీ, పీపీబీ, నాలా, తదితరాల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ - ఆఫీసు విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఈ - ఆఫీస్ వినియోగాన్ని పెంచి, పరిపాలనలో పారదర్శకత, వేగాన్ని సాధించాలన్నారు. ఈ - ఆఫీసుపై శిక్షణ పొంది, వివిధ అంశాలలో అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ-ఆఫీస్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అమలు చేసి, సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, అన్ని మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్**

**గోదావరి పుష్కరాల పిపిటి సమావేశంలో టెక్నికల్ కమిటీ పరిశీలన**

**జగిత్యాల :** జిల్లాలో నిర్వహించనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై పురోగతిని సమీక్షించేందుకు జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన పిపిటి సమావేశంలో టెక్నికల్ కమిటీ సమగ్ర పరిశీలన నిర్వహించింది. ఈ పరిశీలనకు ఇంజినీర్-ఇన్-చీఫ్ జనరల్ ఓ.వి. రమేష్ బాబు, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన మౌలిక వసతుల అభివృద్ధి, భద్రతా చర్యలు, రవాణా సౌకర్యాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య ఏర్పాట్లు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే, ఘాట్‌ల అభివృద్ధి పనులు, రహదారి మరమ్మత్తులు, విద్యుత్ సరఫరా, తాత్కాలిక సౌకర్యాల ఏర్పాటు వంటి అంశాలను వేగవంతం చేయాలని టెక్నికల్ కమిటీ సూచించింది. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ఈ.ఈ.పి.ఆర్. లక్ష్మణ్ రావు, ఈ.ఈ. ఆర్ అండ్ బి శ్రీనివాస్, ధర్మపురి టెంపుల్ ఈవో శ్రీనివాస్, నీటి పారుదల శాఖ అధికారుల, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో వలంటీర్ల వ్యవస్థ

## హైదరాబాద్, ఏప్రిల్ 7

తెలంగాణలో వాలంటీర్ల వ్యవస్థను తీసుకురానున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ప్రతీ రెవెన్యూ గ్రామానికి ముగ్గురు చొప్పున మొత్తం 30 వేల మందిని నియమించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో భూసారాన్ని పరిరక్షించేందుకు ఈ సాయిల్ హెల్త్ వాలంటీర్లు పనిచేస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే ఎంపికైన తొలి దశ వాలంటీర్లకు ట్రైనింగ్ ప్రారంభించినట్లు వెల్లడించారు. రైతులు రసాయనాలను తగ్గించి.. భూసారాన్ని కాపాడేందుకు ఈ వాలంటీర్లు పనిచేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో భూసారాన్ని కాపాడేందుకు భూసార ఆరోగ్య వాలంటీర్లు ( సాయిల్ హెల్త్ వాలంటీర్లు )ను నియమించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 30 వేల మంది ఈ సాయిల్ హెల్త్ వాలంటీర్లను నియమిస్తామని.. ఇందులో భాగంగానే తొలి విడతలో ముఖ్యమంత్రి



## ఒంటికన్ను రాక్షసుడితో మెగా పోరాటం?

అగ్ర హీరో చిరంజీవి నుంచి రానున్న 'విశ్వంభర' సినిమా గురించి ఓ ఆసక్తికరమైన విషయం వెలుగు చూసింది. సోషియో ఫాంటసీ అద్భుతంగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఒంటికన్ను రాక్షసుడితో చిరంజీవి చేసే యుద్ధం హైలైట్‌గా ఉంటుందట. ఈ యాక్షన్ ఎపిసోడ్‌ని హాలీవుడ్ స్థాయిలో రూపొందించారని ఇన్‌సైడ్ టాక్. ఈ సినిమాలోని ప్రధాన ఆకర్షణలో ఈ ఎపిసోడ్ ఒకటని తెలుస్తున్నది. నిజానికి ఈ సినిమా ఈ సమ్మర్‌లోనే విడుదల కావాలి. కానీ తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం సమ్మర్ రేస్ నుంచి కూడా ఈ సినిమా తప్పుకున్నదని తెలుస్తున్నది. సీజీ వర్క్ బ్యాలన్స్ ఉండటం వల్ల ఇంకాస్త ఆలస్యం అయ్యే అవకాశం ఉందని సమాచారం. త్రిష కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మల్లిడి వశిష్ట దర్శకుడు. సంగీతం: ఎం.ఎం.కీరవాణి, నిర్మాతలు: విక్రమ్, వంశీ, ప్రమోద్, నిర్మాణం: యూవీ క్రియేషన్స్.

## నన్ను, నా హీరోయిన్‌ను దారుణంగా ట్రోల్స్ చేస్తున్నారు

విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన లేటెస్ట్ చిత్రం 'ఒఎఐ'. ప్రదీప్ రంగనాథన్, కృతీ శెట్టి జంటగా నటించిన ఈ మూవీ ఏప్రిల్ 10 న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధం అవుతున్నది. ఇక విడుదల సమయం దగ్గర పడుతున్న క్రమంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు చిత్ర బృందం. ఈ క్రమంలోనే ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో భాగంగా విఘ్నేశ్ శివన్ ప్రొఫెనల్ లైఫ్‌తో పాటు పర్సనల్ లైఫ్‌పై కూడా ఆసక్తికర కామెంట్స్ చేశారు. 'టాప్ లీగ్ డైరెక్టర్‌గా, ప్రతి హీరోకు ఫస్ట్ ఆప్షన్‌గా మారడం నా అతి పెద్ద కల. దాని కోసం నేను నా 100% ఎఫర్ట్ పెడుతున్నాను. మ్యూజిక్ విషయంలో అనిరుధ్ రవిచందర్ అందరికీ ఫస్ట్ ఛాయిస్ అయినట్టు, హీరోయిన్ విషయంలో నయనతారా టాప్‌లో ఉన్నట్టు, డైరెక్టర్స్‌లో ఎస్ఎస్ రాజమౌళి, ప్రశాంత్ నీల్, సందీప్ రెడ్డి వంగా లాంటి వారు తమ పీక్‌లో ఉన్నట్టు ఒక రోజు నేను కూడా ఆ స్థాయికి చేరుకుంటానని నమ్మకం ఉంది' అని తెలిపారు. అలాగే పర్సనల్ లైఫ్‌పై మాట్లాడుతూ.. 'మన పర్సనల్ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తే ఏం వస్తుందని కొందరు ప్రశ్నిస్తుంటారు.





## ఆ హీరోయిన్‌పై వస్తున్న వార్తలపై క్లారిటీ ఇచ్చిన అనిల్ రావిపూడి

వరుస బ్లాక్ బస్టర్ హిట్స్‌తో ఇండస్ట్రీలో సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా దూసుకుపోతున్నాడు అనిల్ రావిపూడి. దీంతో ఆయన నుంచి వచ్చే సినిమాల కోసం ఆడియన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ఈ ఇయర్ మెగాస్టార్ చిరంజీవి మన శంకర వర ప్రసాద్ గారు చిత్రంతో ప్రేక్షకులను పలకరించిన ఈయన.. ఇప్పుడు మల్టీ స్టారర్ తెరకెక్కించే పనిలో ఉన్నాడు. ఈ మేరకు విక్టరీ వెంకటేష్, కళ్యాణ్ రామ్ హీరోలుగా ఒక క్లీన్, టిపికల్ అనిల్ ఎంటర్‌టైన్మెంట్‌ను సిద్ధం చేస్తున్నాడు. ఈ కలయికలో సినిమా ప్రకటించినప్పటి నుంచే ఈ ప్రాజెక్టుపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయ్యింది. అంతే కాకుండా ఇందులో నటించే హీరోయిన్స్‌పై ఏదో ఒక న్యూస్ నెట్టింట చక్కర్లు కొడుతూనే ఉంది. ఇందులో భాగంగానే కళ్యాణ్ రామ్ సరసన యంగ్ బ్యూటీ కృతీ శెట్టి హీరోయిన్‌గా నటించబోతున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. దీనిపై తాజాగా క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్. తాజాగా ఒఎఐ ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఈ డైరెక్టర్ కృతీ శెట్టిని ఉద్దేశించి మాట్లాడుతూ.. 'త్వరలో మనం సెట్‌లో కలుద్దాం. ఎలాగో దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇవ్వా?ల్సిన అవసరం లేదు. ఇప్పటికే మనవాళ్లు రాసేశారు' అంటూ చెప్పుకొచ్చాడు. అంటే అనిల్ ప్రాజెక్టులో కృతి భాగం అయినట్లు చెప్పకనే చెప్పేశాడు మన డైరెక్టర్.

## సారా అర్జున్ ఎమోషనల్ పోస్ట్

ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ అందుకుని కలెక్షన్స్‌లో కొత్త రికార్డులు సృష్టిస్తుంది. మార్చి 19న విడుదలైన ఈ చిత్రం తాజాగా భారత బాక్సాఫీస్ వద్ద ?1000 కోట్లు వసూలు చేసిన తొలి బాలీవుడ్ చిత్రంగా చరిత్ర సృష్టించింది. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో రణ్‌వీర్ సింగ్, సారా అర్జున్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఇక ఈ సినిమాపై సక్సెస్‌పై తాజాగా సారా అర్జున్ ఎమోషనల్ నోట్ షేర్ చేసింది. 'నేను ఆదిత్య సార్‌ను మొదటిసారి కలిసినప్పుడు, ఆయన కళ్లలో ఒక ప్రత్యేకమైన మెరుపు కనిపించింది. ఆయన సినిమా కోసం ఏదో అద్భుతం చేస్తారని నాకు అర్థమైంది. ఈ ప్రయాణంలోని ప్రతి అడుగులో నేను ఆ అద్భుతాన్ని గ్రహిస్తూనే ఉన్నాను. అలాగే.. ఈ ప్రయాణంలో మనమందరం గమనించని శక్తులు, ఫ్రేమ్ బయట నిలబడిన అసంఖ్యాకమైన వ్యక్తులు ఈ సక్సెస్‌కు ఒక కారణం. దీంతో పాటు ఈ నౌకకు సారథి అయిన ఆదిత్య ధర్, ఆయన దర్శకత్వ బృందానికి, ఈ కలను ఇంత అద్భుతంగా తెరపైకి తీసుకురావడానికి అవిశ్రాంతంగా పనిచేసిన వారికి, మేము వెలుగులో నిలబడటానికి తుఫానులను తట్టుకున్న నిర్మాతలకు, నిర్మాణ బృందానికి అందరికి ఈ సక్సెస్ అంకితం. ఇంతటి ఆదరణ ఇస్తున్న ప్రేక్షకులకు ప్రత్యేక ధన్యవాదాలు' అంటూ తెలిపింది సారా.



## ఇకపై సింగిల్‌గానే ఉంటా!

ప్రేమ, పెళ్లి విషయాల్లో తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్యక్తం చేస్తుంటుంది అగ్ర కథానాయిక శృతిహాసన్. గతంలో డూడుల్ ఆర్టిస్టు శంతను హజారికాతో సుదీర్ఘ ప్రేమాయణం నడిపిందీ భామ. వారిద్దరూ పెళ్లిపీటలెక్కబోతున్నారనే వార్తలు కూడా వచ్చాయి. అయితే అనంతర పరిణామాల్లో ఈ జంట విడిపోయారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నటనపై దృష్టి పెట్టింది శృతిహాసన్. సెలెక్టివ్‌గా సినిమాల్ని ఎంచుకుంటున్నది. తాజా ఇంటర్వ్యూలో ఆమె తన బ్రేకప్ స్టోరీని పంచుకుంది. తాను ఇప్పటివరకు ఆరుసార్లు విఫల ప్రేమ అనుభవాల్ని చవిచూశానని, వాటివల్ల మానసిక సంఘర్షణకు లోనయ్యానని చెప్పింది. ప్రస్తుతం సినిమాలే ప్రపంచంగా ప్రశాంత జీవితం గడుపుతున్నానని, ఇక మీదట తాను ఒంటరిగానే ఉంటానని శృతిహాసన్ తెలిపింది. ప్రస్తుతం ఆమె మాటలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.





## ఆ హీరోను చూస్తే.. నాకు చాలా అసూయగా ఉండేది

కోలీవుడ్ స్టార్ హీరో విశాల్ ఇటీవల ఒక కార్యక్రమంలో పాల్గొని తోటి నటుడు ప్రశాంత్ ఎదుగుదలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "నేను ఇటీవల ఆంధ్రప్రదేశ్ వెళ్ళాను. అక్కడ ఒక చిన్న పల్లెటూరిలో 'యూత్' మూవీ పోస్టర్ చూశాను. ఒక తమిళ సినిమాకు తెలుగులో కూడా ఇంతటి ఆదరణ లభించడం, అక్కడి యువత ఆ చిత్రాన్ని అంతలా ఓన్ చేసుకోవడం చూసి నాకు చాలా గర్వంగా అనిపించింది. దీనికి జీవీ ఒక ముఖ్య ఆధారం. మన సినిమాలు భాషా సరిహద్దులు దాటి వెళ్లడం నిజంగా గొప్ప విషయం" అని సంతోషం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఒకప్పటి స్టార్ హీరో ప్రశాంత్ గురించి విశాల్ తన పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. "నిజం చెప్పాలంటే, అప్పట్లో నాకు ప్రశాంత్ అంటే చాలా అసూయగా ఉండేది. మా చుట్టూ ఉన్న అమ్మాయిలందరూ అతన్ని ఒక రేంజ్‌లో ఆరాధించేవారు. అతనికి ఉన్న ఫాలోయింగ్ చూసి ముచ్చటగా అనిపించేది. అప్పట్లో ప్రశాంత్‌కు వరుసగా అవకాశాలు వచ్చేవి, పైగా ఆయన వరుసగా సిల్వర్ జూబ్లీ ఘనవిజయం సాధించిన చిత్రాలను అందించారు" అని విశాల్ పేర్కొన్నారు. తన సినీ ప్రయాణం గురించి చెబుతూ.. "ప్రశాంత్ చూడటానికి చాలా అందంగా ఉండేవాడు, అందుకే అతనికి త్వరగా అవకాశాలు వచ్చాయి. కానీ నా రంగు వల్ల నాకు అవకాశాలు రావడానికి చాలా సమయం పట్టింది. చాలా కాలం వేచి చూడాల్సి వచ్చింది" అని విశాల్ తన మనసులోని మాట బయటపెట్టారు. ప్రస్తుతం యువత సినిమాల పట్ల చూపిస్తున్న ఉత్సాహం చూస్తుంటే చాలా ఆనందంగా ఉందని విశాల్ అన్నారు.

Editor, Publisher & Owner by Reddy Shekar, 3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463